ప్రజాశక్తి

Vol. 4, no. 8

(Feb. 23, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 8

(Feb. 23, 1944)

Bejavāḍa, 1944

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 8	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (పం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 23-2-44

ఐక్యతవల్ల విజయంపొందుతామని చరిత్ర రుజువుచేస్తోంది

7 వ గుంటూరు జిల్లా విద్యార్థి (ప్రతినిధుల) సభ



యం. బసవపున్నయ్య

"ఎగురవేయ్ విజయపతాకం-విద్యార్థి పతాకం" - అంటూ విద్యార్థులు పాడుతున్న సమిష్టిగానం బయటికి వినపడుతోంది. 7 వ గుంటూరుజిల్లా విద్యార్థి (ప్రతినిధుల) మహాసభ-అధ్యక్షులు తమ్మారెడ్డి - ప్రారంభకులు బసవపున్నయ్య - అంటూ వ్రాసిన అట్టలను చదువుకుంటూ బాపట్ల సినిమాహాలుగేటులో ప్రవేశించాను. ఒకప్రక్క "ప్రభలపెండాల్" అన్న అక్షరాలు కన్పించాయి. విద్యార్థినాయకుడుగా, కమ్యూనిస్టుగా, దేశసేవలో మునిగి పాపిష్టి క్షయవ్యాధికి బలియైపోయిన కామ్రేడ్ ప్రభలను ఈ విధంగా గౌరవించడం తమ్ము దాము గౌరవించుకోవడమే.

జండాపాట ముగిసింది. "స్వాతంత్ర్యం-శాంతి-అభ్యుదయం" కోరే విద్యార్థిజండాను కామ్రేడ్ యస్. వి. నరసయ్య (ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ సహాయకార్యదర్శి) ఎగురవేశారు. ఏ విద్యార్థిపతాకంక్రింద ఆంధ్ర విద్యార్థులందరూ ఐక్యమైనిలచి అనేక విజయాలను సాధించారో, ఏ విద్యార్థిపతాక గౌరవం నిలబెట్టడానికి కృషిచేస్తూ ఫణిచక్రవర్తిలాంటి విద్యార్థినాయకులు మరణించారో, ఆ విద్యార్థిపతాకంక్రింద విద్యార్థు లందరూ నిలిచి దేశస్వాతంత్ర్య సముపార్జనకు ముందడుగు వేయాలి-అంటూ నరసయ్యగారుపన్యసించారు.

తర్వాత, కామ్రేడ్స్ తమ్మారెడ్డి, బసవపున్నయ్య విద్యార్థి వలంటీర్లు ఇచ్చిన 'గార్డు ఆఫ్ ఆనర్'ను అందుకొంటూ హాలులో ప్రవేశించారు.

ఆంధ్రదేశంలో విద్యార్థి ఉద్యమాన్ని ఉన్నతస్థాయికితెచ్చిన బసవపున్నయ్య, అనేక విచ్ఛిన్నశక్తుల నెదుర్కొంటూ, అనేక విషమ పరిస్థితులను దాటుకుంటూ, విద్యార్థి వుద్యమాన్ని బలిష్టమొనర్చి నడుపుతున్న తమ్మారెడ్డి ఈ గౌరవానికి అర్హులని వేరే చెప్పనక్కర్లేదు.

వేదికపైన గాంధీ, నెహ్రూ, జిన్నా చిత్రాలున్నాయి. హృదయం జలదరింపజేసే బెంగాల్ కరువుచిత్రాలు వేదికప్రక్కఅమర్చారు.

"కరువు బాధలకు హిందూ ముస్లిం భేదంలేదు"

స్థానిక ముస్లింలీగ్ కార్యదర్శి, మౌలానా మౌల్వీగారు, ముస్లిం దేశభక్తుల తరపున ఒక సందేశమిచ్చారు.

"ఈనాడు ప్రజల కనేక ఇబ్బందులున్నాయి. హిందూ, ముస్లిం అని భేదం లేకుండా ప్రజలంతా, అధికధరలవల్ల, వస్తువులు దొరక్కపోవడంవల్ల ఇబ్బంది పడుతున్నారు. పంచదార, కిరోసిన్, దొరకడంలేదు. బియ్యం ధర రోజురోజూ పెరిగిపోతూఉంది. కంట్రోలు పెట్టినా, దానిపై ప్రజల అజమాయిషీ లేనందువల్ల, బ్లాక్‌మార్కెట్ ఎక్కువ అవుతోంది. హిందూ ముస్లింలు ఐక్యమై, ఐక్యకమిటీలను ఏర్పర్చి వస్తువులను ప్రజల కందించేటట్లు చేయాలి. రాత్రి, పవలు అనేవి ఎలావుంటాయో, మంచివాళ్ళు చెడ్డవాళ్ళు హిందువులలోను, ముస్లింలలోను ఉంటారు. ఆ చెడ్డవాళ్ళను నాశనంచేయాలి. ఆ చెడ్డవాళ్ళెవరో గాదు, తిండిదొంగలే. ప్రభుత్వం హక్కులు ఇవ్వలేదని, మనలో దాగివున్న శత్రువులను, బయట కాచియున్న శత్రువులను ఎదిరించకుండా చేతులుముడిచి కూర్చోరాదు. సోవియట్‌యూనియన్‌లో ఎన్నోమతాలున్నా, జాతులున్నా అందరూ కలసి శత్రువును ఎదిరిస్తున్నారు. అలాగే శత్రువును మనం ఎదిరించాలి. ప్రజల్ని బాధలనుండి రక్షించడానికి ఇరువురమూ కృషిచేయాలి. ఇదీవిద్యార్థులకు మా ముస్లిం ప్రజల తరపున నే నిచ్చే సందేశం" అంటూ కరతాళధ్వనులమధ్య ముగించారు.

మా విలేఖరి

తర్వాత అధ్యక్షులు విద్యార్థిసభకు వచ్చిన సందేశాలను చదివారు. జైలులో డిటెన్యూగావుంటున్న కామ్రేడ్ కట్టయ్య ఒక సందేశం పంపాడని తెలిసింది. కానిఆసందేశం మాత్రం విద్యార్థుల కంటబడకుండాచేసింది ప్రభుత్వం.

విద్యార్థి సంఘాల ఆవశ్యకత చరిత్రే రుజువుచేసింది

కామ్రేడ్ బసవపున్నయ్య ప్రారంభోపన్యాసంగావించారు. బసవపున్నయ్య, ఆంధ్రరాష్ట్రి విద్యార్థిఫెడరేషన్ మాజీకార్యదర్శి. నేడు కమ్యూనిస్టుపార్టీ రాష్ట్రకమిటీలో సభ్యుడు. అంచేత, విద్యార్థిరంగంలోని తన పూర్వానుభవాన్ని మాత్రమేగాక, విద్యార్థిరంగంలోను, భారత రాజకీయరంగంలోను కమ్యూనిస్టుల దృక్పథ మేమిటో తెలియజేయడానికి తాను వచ్చానని చెప్పారు.

ఆయన ఉపన్యాస సారాంశం ఇది: ఆంధ్రదేశంలో సజీవమైన విద్యార్థి ఉద్యమం 1937 లోనే ప్రారంభమైనదని చెప్పాలి. ఆరోజుల్లో విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనవచ్చునా లేదా అంటూ చర్చలు జరుగుచుండేవి. విద్యార్థుల ప్రత్యేక కష్టాలు నివారించుకోడానికి విద్యార్థిసంఘా లవసరమేనని కమ్యూనిస్టుపార్టీ నినాదం ఇచ్చింది. విద్యార్థిసంఘాల ఆవశ్యకతను చరిత్రయే రుజువుచేసింది. ఒకప్పుడు విద్యార్థిసంఘాలఅవసరం లేదన్న రాయిస్టులు, పోటీ విద్యార్థిసంఘాలు పెట్టాలని ప్రయత్నించి బోల్తాపడ్డారు. కాంగ్రెసు ఎన్నికలలో పాల్గొనుటద్వారా విద్యార్థులలో రాజకీయచైతన్యం హెచ్చింది. ఆనాటినుండి డిటెన్షన్లకు వ్యతిరేకంగా పోరాడి అనేకచోట్ల విద్యార్థులు జయించారు. విద్యార్థులనుకొట్టడం, తిట్టడం చాలవరకు తగ్గిపోయింది. విద్యార్థులు అల్లరి చిల్లరి పనులు చేయడం తగ్గింది. విద్యార్థినులను గౌరవించడం నేర్చుకున్నారు. మొట్టమొదటి రోజుల్లో, ఉపాధ్యాయులూ - విద్యార్థులూ పరస్పరం శత్రువులనే భావం ఉపాధ్యాయులలో ఉండేది. కాని, ఉపాధ్యాయుల కష్టాలనుగూడతీర్చాలనేనేటి విద్యార్థుల ఆందోళన చూసి, ఆదురభిప్రాయం మార్చుకొంటున్నారు. రాజకీయంగా కూడ విద్యార్థులస్థాయి హెచ్చింది. మొట్టమొదట ముస్లిం జాతులకు స్వయంనిర్ణయ సూత్రాన్ని అమలుపర్చ వలసిందని నాగపూర్‌లో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ కోరింది. గత అగస్టు సంక్షోభంలో, విద్యార్థులను పెడత్రోవ బట్టకుండా చాలవరకు విద్యార్థులను, ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ కాపాడింది.

ఇక కమ్యూనిస్టుపార్టీ అగస్టుఘటనల సమయంలో, విధ్వంసక చర్యలు కాంగ్రెసుకార్యక్రమంఎలాకాదోవివరించింది. జాతీయఐక్యత, జాతీయ రక్షణ, జాతీయ ప్రభుత్వం, అనే నినాదాలనుపార్టీయిచ్చింది. అవి ఎలాసరియైన నినాదాలో బసవపున్నయ్యగారు వివరించారు. "ఐక్యమవండి - లేదా నాశనం తప్పదు" అన్న మాటలు చరిత్ర ఎలా రుజువుచేసిందో చెప్పారు. అనైక్యతవల్ల బెంగాలులో 50 లక్షల మంది మరణించారు. దేశనాయకులు జైళ్ళలో మ్రగ్గుతున్నారు. దేశమంతటా కరువు కాటకాలు వ్యాపించుతున్నాయి. ఐక్యతవల్ల విజయం పొందుతామని ప్రపంచ చరిత్ర ఋజువుచేస్తోంది. ఐక్యతతో శత్రువు నెదిరించి చైనా, మిత్రరాజ్యాలతో సమాన హోదాను పొందింది, ఐక్యతతో 10 లక్షల లెబనాన్ ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించారు. యుగోస్లావియా గెరిల్లాలు తమ దేశానికి భవిష్యత్ కర్తలు కావడానికి కారణం ఐక్యతే అన్నారు.

ఆవేళ, మరుసటిరోజు ఉదయం, తీర్మానాలను చర్చించడం, ఆమోదించడం జరిగింది. సాయంత్రం బహిరంగసభ జరిగింది. ఇలా 12, 13 తేదీలలో జిల్లావిద్యార్థి ప్రతినిధులు చర్చించి అంగీకరించిన తీర్మానాల సారాంశం ఇక్కడ ఇస్తాను:

మహాదేవదేశాయి-కొట్నీస్-ఆర్.యస్. పండిట్-ఫణిచక్రవర్తి మొదలగు దేశసేవకుల మరణానికి చింతిల్లుతూ మొదట ఒక తీర్మానం గావించబడింది.

మనకు పడమటినుండి నాజీ ప్రమాదం తప్పించిన రెడ్‌ఆర్మీకి జోహారు లర్పించుతూ తీర్మానించారు.

పశ్చిమగోదావరి, అనంతపూర్ జిల్లాల విద్యార్థి కార్యక్రమానికి అడ్డుపడినందుకూ, గుంటూరు ఊరేగింపులను నిషేధించినందుకు, సరోజినీదేవిపై ఆంక్షవిధించినందుకు అధికారుల చర్యలను ఖండించారు. ఆగస్టురోజుల్లో విద్యార్థులను రెచ్చిపోకుండా ఆపిన కామ్రేడ్ కట్టయ్యను నిర్బంధించడం అక్రమమనీ, వెంటనే విడుదలచేయాలనీ తీర్మానించారు.

మామిడిపూడి రంగయ్యగారిని, మధ్యకాలంలో అధ్యాపకపదవి నుండి తీసివేయడంవల్ల విద్యార్థులకునష్టమనీ, తిరిగి వారిని అధ్యాపకులుగా నియమించాలనీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిని కోరుతూ తీర్మానించారు.

సత్తెనపల్లిలో, కంట్రోలురేటుకు వచ్చిన కాగితాన్ని ఎక్కువ ధరలకు అమ్ముకొని విద్యాసంస్థను ఒక వ్యాపారసంస్థగా మార్చివైచిన సత్తెనపల్లి హైస్కూలు హెడ్మాష్టరుగారి అవకతవకలను వెలిబుచ్చినందుకు స్థానిక విద్యార్థి కార్యదర్శి మహబూబ్‌ను స్కూలునుండి వెళ్ళగొట్టుట అక్రమమనీ, అతనిని తిరిగి హైస్కూలులో చేర్చుకోవాలనీ కోరారు.

విద్యానిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థులను కొట్టడం, తిట్టడం, బెంచీలపై ఎక్కించడం, మొదలగు పనులను గావించుతున్న తెనాలి హైస్కూలు ఉపాధ్యాయుల చర్యలను నిరసించుతూ మరొక తీర్మానం గావించబడింది.

ఉపాధ్యాయుల - విద్యార్థులమధ్య సహకారం పెంపొందించాలనీ; విద్యావిధానంలో మార్పులు తేవాలనీ; క్షామపీడితులకు సహాయంచేస్తూ, వేసవికాలంలో పల్నాడులో క్షామనివారణకృషికి విద్యార్థులు పూనుకోవాలనీ; తెలుగుభాషలోనే విద్య నేర్పాలని, సైన్సు, టెక్నికల్ విషయాలను కూడ తెలుగులో చదివించుటవల్ల విద్యార్థులవిజ్ఞానం పెంపొందగలదనీ; విద్యార్థులు-ముఖ్యంగా విద్యార్థిఉద్యమంలో పాల్గొనేవారు బాగా చదవాలనీ; గుంటూరు పురపాలక సంఘంవారు విద్యార్థినులకు ప్రత్యేకంగా కాలేజీని నిర్మించపూనుకొన్నందులకు ప్రశంసిస్తూ, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రింకోరుతూ, మరికొన్ని తీర్మానాలు గావించబడినాయి. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ఎలా మతోద్రేకాన్ని రెచ్చగొడుతూవుందో, అది ఎలా ఫాసిస్టుపద్ధతులపై నిర్మింపబడుతూవుందో, గాంధిజీ రాష్ట్రీయ స్వయంసేవకసంఘాన్ని ఎలా నిరసించాడో తెలియజేస్తూ, విద్యార్థులు ఆర్. యస్. యస్. కు దూరంగా వుండాలనికోరుతూ ఇంకొక తీర్మానం గావించబడింది.

రాజకీయ తీర్మానం

ముఖ్యమైన మరోతీర్మానం రాజకీయ తీర్మానం. ఈ తీర్మాన సారాంశం: నాయకులు జైళ్ళలోఉన్నారు. దేశసరిహద్దులలో శత్రువు పొంచివుంది. క్షామం దేశమంతటా వ్యాపించింది. బెంగాల్, ఒరిస్సా, రాయలసీమ, కేరళలలోనేగాక ఇపుడిపుడే ఉత్తర విశాఖ, పల్నాడుసీమలకు వ్యాపించింది. గత సంవత్సరం నెలకు 11 రూపాయలు భోజనానికి చెల్లించేవిద్యార్థి ఈనాడు 20 రూపాయలు చెల్లించవలసి వస్తోంది. ఈపరిస్థితుల మూలముగా బెంగాల్‌లో చాలవరకు విద్యాసంస్థలు మూయవలసి వచ్చింది. ఇందుకు కారణం తిండిదొంగలే. తిండిదొంగల నరికట్టాలన్నా, ప్రక్కనవున్న శత్రువును తరమాలన్నా, నేటి భారత ప్రతిష్టంభన అంతమొందాలి. అందుకు కాంగ్రెసు – లీగులమధ్య సహకారంరావాలి. ముస్లిములుకోరే స్వయంనిర్ణయ హక్కుకు కాంగ్రెసు అంగీకరించాలి. కాంగ్రెసు నాయకుల విడుదలను ముస్లింలీగ్ కోరాలి. ఈజాతీయైక్యతఒకటే జాతిరక్షణకు, జాతీయ ప్రభుత్వానికి, దారితీయగలదు. ప్రతిష్టంభన అవసరమనీ, కరువు పెంపొందిన కొలదీ విప్లవం దగ్గరకువస్తుందనీ, విద్రోహకరమైన వాదనలతో కాంగ్రెసు సోషలిస్టు–ఫార్వర్డుబ్లాకు ముఠాలవారు విద్యార్థులను పెడత్రోవబట్టించ ప్రయత్నించుతున్నారు. గాంధిజీలేఖలు, సరోజినీదేవి ప్రకటనలు, విధ్వంసకచర్యలు కాంగ్రెసు కార్యక్రమం కాదని స్పష్టంచేశాక వీరిబండారం బయటపడుతోంది. అందుచే విద్యార్థులందరూ, కాగితం, కిరోసిన్, ఆహారసమస్యలపై ఐక్యమై జాతీయైక్యత – జాతీప్రభుత్వం – జాతీయ రక్షణ అనే నినాదాలతో కృషిచేయాలి.

స్వానుభవంతో చర్చలు

ఈ తీర్మానాన్ని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన 75 మంది (మిగతా 6 వ పేజీ)

బుధవారం ప్రజాశక్తి 23-2-44

వేవెల్ ఉపన్యాసం

క్రొత్తవైస్రాయి వేవెల్ అధికారం స్వీకరించాక నాలుగునెలలు గడచిపోయాయి. ఇంతవరదాకా భారత పరిస్థితులను అవగాహన చేసుకొంటేగాని రాజకీయ సమస్యను గురించి ఎట్టి అభిప్రాయం ప్రకటించలేనని వాయిదావేసుకుంటూ వచ్చాడు. 17 వ తేదీ కేంద్రశాసనసభల సమిష్టి సమావేశంముందు వేవెల్ మాట్లాడాడు. ఆయన నాలుగునెలల అనుభవంలోనూ నేర్చుకొన్నది శూన్యమనీ, భారత ప్రజా హృదయాన్ని ఏమాత్రం గ్రహించలేదనీ వైస్రాయి ఉపన్యాసం తెలుపుతుంది.

ఎన్ని కష్టాలనైనా సహించి, ఎంత త్యాగమైనాసరేచేసి, మిత్రరాజ్యాల సత్వర విజయాన్ని సాధించడమే తమ ప్రధాన ఆశయమని వేవెల్ చెప్పుకొన్నాడు. జపాన్ దురాశలను సర్వనాశనం చేయనిదే భారతదేశానికి శాంతిసౌఖ్యాలు రాజాలవు అని కూడ తెలియజేశాడు. జపానుపై యుద్ధానికి ముఖ్యకేంద్రాలలో ఒకటైన భారత దేశంలో సంతృప్తి, సుస్థిరత్వం అవసరమనీ, అందుచే ఆహారసమస్యను పరిష్కరించడానికి తన ప్రభుత్వం పూనుకుందనీ చెప్పుకొన్నాడు. యుద్ధానంతరం భారత దేశానికి మంచి భవిష్యత్తు వుందనీ, ఆర్థిక పునర్నిర్మాణంచేయాలనీ, భారతప్రముఖ వ్యాపారస్తులు అందజేసిన 15 ఏండ్ల ప్లానును ప్రభుత్వం పరిశీలించుతూందనీ అన్నాడు.

కాని పై సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి భారత రాజకీయ ప్రతిష్టంభన తొలగాలి. అందుకు వేవెల్ ఉపన్యాసం ఏమైనా సూచించుతూందా ? అంటే శూన్యమని చెప్పవలసివుంటుంది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు యిదివరదాకా చర్చిల్, అమెరీ, లిన్‌లిత్గోలద్వారా ఏ చిలకపలుకులు పలికించారో వాటినే వేవెల్ ఏమీ చేయి జారకుండా, పట్టువిడువకుండా, మెత్తనిమాటలలో మరల వల్లించాడు.

చూడండి మరి: క్రిప్సు ప్రతిపాదనలు అలాగే నిలచివున్నాయట. ఇష్టముంటే స్వీకరించవచ్చునట. శాంతిభద్రతలను కాపాడి అభివృద్ధికి దారితీయగల భారతీయులకు భారతపరిపాలన అప్పగించడం న్యాయమనీ, తమ ధర్మమని గుర్తించుతున్నామన్నాడు. "కాని ముఖ్యమైన రెండు భారతీయపార్టీలు రాజీపడితేగాని అభివృద్ధికి నాకు ఎట్టి ఆశ కన్పించడంలేద"న్నాడు. భారతదేశరక్షణలోను, యుద్ధకృషిలోను సహకారం చేయసిద్ధంగావున్న భారతనాయకులకు క్రిప్సు రాయబారాలలో సూచించిన అవకాశాలను యివ్వడానికి ప్రభుత్వం యిప్పటికీ సిద్ధంగానే వున్నదన్నాడు. కాని డిటెయిన్‌చేయబడిన నాయకులను, వారు సహకారం చేయడానికి సంసిద్ధతను తెలుపనిదే విడుదలచేయాలని కోరడంలో అర్థంలేదన్నాడు. ఎన్నో విషాదఘటనలకు తావిచ్చిన 'క్విట్ ఇండియా' (బొంబాయి) తీర్మానాన్ని ఉపసంహరించుకోడానికి, భావికర్తవ్యాలను ఎదుర్కోడంలో తమ సహకారాన్ని తెలుపడానికి, ఎట్టి సంప్రదింపులు అవుసరంలేదన్నాడు. అంటే గాంధీజీ లేఖలలో కోరినట్లు వర్కింగుకమిటీ సభ్యులను కలసికొనే అవకాశం యివ్వ నిరాకరించాడు.

ప్రస్తుతం ప్రభుత్వాధికారం బ్రిటీషు పార్లమెంటు చేతిక్రిందనే వుంటుందన్నాడు. భారతీయులంతాకలసి భావిభారత రాజ్యాంగవిధానాన్ని నిర్ణయించుకొంటేగాని ప్రభుత్వాధికారం భారతీయుల పరంచేయడం సాధ్యంకాదన్నాడు. భారతదేశం యొక్క భూగోళాన్నిమార్చడం అసంభవమనీ, జాతులసమస్యను కెనడా, స్విట్జర్లాండు, రష్యాపద్ధతులలో ఏదో ఒకమాదిరి ననుసరించి పరిష్కరించుకోవా లన్నాడు.

ఉన్నతాశయాలుగల ముఖ్యులు కొందరు ప్రభుత్వానికి దూరంగా వున్నారనీ, వారి శక్తిసామర్థ్యాలు తాను గుర్తించుతున్నాననీ, వేవెల్ చెప్పాడు. వారు ఆచరణ యోగ్యంకాని నిరర్థకపాలసీని అవలంబించుతున్నారని ఆక్షేపించాడు. ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి, భావిభారత సమస్యలు పరిష్కరించడానికి, వారి సహకారాన్ని కోరుతున్నానన్నాడు. ప్రభుత్వంలో పాల్గొనడానికి యిష్టంలేకపోయినా, భావిసమస్యల విషయంలో సహాయం చేయవచ్చునన్నాడు. కాని ఆగస్టు 8 తీర్మానాన్ని చేసినవారిని, వారు సహాయనిరాకరణాన్ని, ఆటంకాలుపెట్టే పాలసీని, మానుకొన్నారని నమ్మకం కలిగితేగాని విడుదలచేయడానికి కారణం కన్పించడం లేదన్నాడు. అనగా, ప్రజల సంపూర్ణసహకారాన్ని సాధించగల నాయకుల విడుదలను నిరాకరించాడన్నమాట.

వైస్రాయి ఉపన్యాసంలో రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి ఎట్టి సూచనాలేదు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు యీ ప్రతిష్టంభన కొనసాగడమే మంచిదనుకొంటున్నారు. ప్రజాసహకారంతో నిమిత్తంలేకుండానే, ఆయుధ బలంతోనే విజయం సాధించాలని కలలుగంటున్నారు. ఇది, వేవెల్ తన ప్రధాన ఆశయమని చెప్పుకొన్న సత్వర మిత్రవిజయానికి మార్గం కానేకాదు. కాస్త పరిశీలించిచూస్తే ఇటలీ, బర్మా యుద్ధరంగాలే యిందుకు చక్కని ఉదాహరణలు. ఇటలీలో సామ్రాజ్యవాదులు ప్రజావిరోధి బడోగ్లియోతో మంతనాలాడుతూ, ఫాసిస్టు వ్యతిరేకులైన ప్రజానాయకుల సహకారం లేకపోవడంవల్లనే ఇటలీ యుద్ధం అలా నీళ్లుకారుతూ సాగుతూంది. బర్మా ప్రజలకు స్వాతంత్ర్యం యివ్వడానికే తాము పోరాడుతున్నామని ప్రకటించకపోవడం, యుద్ధ నిర్వాహణ కేంద్రంగావున్న భారతదేశంలోని ప్రజానాయకుల సహకారం సంపాదించలేకపోవడంవల్లనే బర్మాయుద్ధం కునారిల్లుతూ వుంది. సామ్రాజ్యవాదులు వినాశకరమైన యీ పాలసీని వదలనిచో దీర్ఘకాల యుద్ధంలో మిత్రరాజ్యాల ప్రజలు ఆహుతికావలసివస్తారు. అందుచే సత్వరవిజయం కోసమే బ్రిటీషు సామ్రాజ్యవాదుల పాలసీని మిత్రరాజ్యాల ప్రజలు ఓడించాలి.

అదేవిధంగా భారతదేశంపై తమ పెత్తనం కొనసాగించాలనే సామ్రాజ్యవాదుల ఎత్తులను ఓడించడానికి భారతీయులం మన కర్తవ్యాన్ని నిర్వహించాలి. భారత స్వాతంత్ర్యంకోసం, ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కుకొరకు, కాంగ్రెసు-ముస్లింలీగులు ఏకంకావాలి. దేశరక్షణ, క్షామనివారణకొరకు పనిచేస్తూ భారత ప్రజా ఐకమత్యాన్ని నిర్మించితే బ్రిటీషు ప్రభుత్వం ఎత్తులను ఓడించగల్గుతాము. జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకొని ప్రజలను రక్షించగల్గుతాము. సత్వర మిత్రరాజ్య విజయానికి భారతదేశం తోడ్పగల్గుతుంది.

★ మన రాజకీయాలు

రైలు టిక్కెట్లపై రూపాయికి పావలా హెచ్చింపు

కేంద్రశాసన సభలో రైల్వే మెంబరు బడ్జటు ఉపన్యాసం

— కంభంపాటి సత్యనారాయణ

ప్రభుత్వం నడిపే రైళ్ళమీద క్రిందటిసంవత్సరం 45 కోట్ల రూపాయలు లాభంవచ్చినట్లు కేంద్రశాసన సభలో ఇండియా ప్రభుత్వసభ్యుడు తెలియజేశాడు. కొత్తసంవత్సరానికి 52 కోట్లు లాభం వస్తుందని అంచనావేశాడు, ఎందుకంటే, రూపాయికి నాలుగణాలచొప్పున ఏప్రిల్ 1 వ తారీకునుంచి టిక్కెట్టురేట్లు హెచ్చించబడతాయి. ఈ 52 కోట్ల ధనాన్ని ప్రభుత్వం యెలా వినియోగించ దలచుకుంది? 10 కోట్ల రూపాయలు మూడోతరగతి ప్రయాణీకుల సౌకర్యాలకు ఖర్చుపెడతారట. 31 కోట్లు ఇండియా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. దాదాపు 11 కోట్లు రైల్వే రిజర్వుఫండులో కలుస్తుంది.

సర్ఎడ్వర్డ్‌బెంథాల్ బడ్జటుఉపన్యాసంలో గత సంవత్సరం రైలు ప్రయాణీకుల సంఖ్య విపరీతంగా పెరగడంవల్ల గడ్డుసమస్య లెన్నో ఏర్పడినవన్నాడు. దేశంలో బొగ్గు తగినంతగా సప్లయికానందువల్ల, రైల్వేఇంజన్లను యుద్ధావసరాలకు యెక్కువగా పంపడంవల్ల, ప్యాసింజరు రైళ్ల సంఖ్యను యిక హెచ్చించడానికి వీల్లేదన్నాడు. రూపాయికి నాలుగణాల చొప్పున టిక్కెట్టు రేట్లను హెచ్చిస్తే, ప్రయాణీకుల సంఖ్య తగ్గనూ తగ్గుతుంది; నోట్ల ముమ్మరంకూడా కొంత తరగనూ తరుగుతుంది; కొత్తగా లభించే 10 కోట్ల రూపాయలతో మూడవతరగతి ప్రయాణీకులకు కావలసినన్ని సదుపాయాలుచేయనూవచ్చు. రైలు ప్రయాణాలెక్కువ కావడం, పంటలకు ధరలు పెరగడం, చూస్తే ప్రజలు యీమాత్రం త్యాగంచేయడానికి శక్తిని కలిగియున్నారు.

ఇదీ రైల్వేమెంబరు మాట్లాడిన ధోరణి.

ప్రయాణీకుల అవస్థలు

రైల్వే మెంబరు ఆర్గ్యుమెంట్లు ఎవరినీ మోసపుచ్చవు. ఇప్పటికే ప్యాసింజరు రైళ్ల సంఖ్యను చాలావరకు తగ్గించివేశారు. అనేక సందర్భాలలో బుకింగులు ఆపివేస్తున్నారు. అదృష్టవశాత్తు టిక్కెట్టుదొరికితే, మనిషి మీద మనిషీ-మనిషి మీద మనిషీ! ఏపెట్టె చూచినా, జనం యిసుక రాలకుండా క్రిక్కిరిసి కూచోవలసి వస్తూంది - కూచోవడం కాదు, నుంచోవలసివస్తూంది. పనులున్నవాడు ప్రయాణం యెలామానుకోగలడు? పనులు లేనివాడు ఉక్కిరి బిక్కిరిఅయి, శరీరాన్ని యిలా ఎందుకు హూనంచేసుకుంటాడు? ఇలాంటి వారందరు రూపాయికి పావలా చొప్పున యెక్కువ యివ్వగలిగిన వారేనంటాడు బెంథాల్. తన చేతగానితనానికి తలవంచుకోడానికి బదులు, రైలు ప్రయాణం, చేసేవారిపై యిలా సుంకం విధిస్తున్నాడు! పైగా, పంటలకుధరలు పెరిగాయట! అందువల్ల రైతు భోగభాగ్యాలతో తులతూగుతున్నాడట! ఆహార ధాన్యాల ఖరీదుకంటె బట్టఖరీదు, ఎరువుల ఖరీదు, విత్తనాలఖరీదు, వ్యవసాయ సామగ్రిఖరీదు, ఎన్నిరెట్లు పెరిగిపోయాయో బెంథాల్ యెరుగని విషయంకాదు.

పాతవాగ్దానాలకెంత విలువో కొత్తవానికీ అంతే !

ప్రయాణీకులకు సదుపాయాలు చేస్తామని 1937 నుంచీ ప్రభుత్వం వాగ్దానాలు చేస్తూనే ఉంది. వాటికెంత విలువఉందో, యిప్పటి కొత్తవాగ్దానాలకూ అంతే విలువ. నిజంగా ప్రయాణీకులకు సదుపాయాలు చేయదలచుకుంటే, ఇండియా ప్రభుత్వానికి కానుకగా ఇవ్వబోయే 31 కోట్ల రూపాయలలో 10 కోట్లు తగ్గించి యివ్వవచ్చునుగా! కాని యిది రైల్వేపాలకవర్గానికి రుచిస్తుందా? ఉన్నసదుపాయాన్ని పీకివేయకుండా ఉంటే, వెయ్యి కొత్తసదుపాయాలు చేసిన ఫలం.

ప్రజల్ని నమ్మించడంకోసం బెంథాల్ ఆశలు చూపుతున్నాడు. యుద్ధం పూర్తి అయాక ఇండియాలోనే ఇంజన్లు, బాయిలర్లు, తయారౌతాయట! రైల్వే కార్మికులకు కొత్త రిలీఫ్ స్కీము లుంటాయట! గుడ్సుబళ్ళు, ప్యాసింజరుబళ్ళు, ఇప్పటికంటె చాకచక్యంగా నడుపబడతాయట! రోడ్డు రహదారీని బట్టి రైల్వే రహదారీనికూడా అభివృద్ధి చేస్తారట!

సవతితల్లిప్రేమ

మనదేశంలో పరిశ్రమలపట్ల ప్రభుత్వం చూపే సవతితల్లిప్రేమ యెవరెరుగరు? ఇంజన్లు, బాయిలర్లు తయారుచేసుకొనే అవకాశం యుద్ధానంతరంలభిస్తుందని గ్యారంటీఏముంది? నిజంగా ప్రభుత్వానికి ఆఉద్దేశ్యమే ఉంటే, యిప్పుడెందుకు నిషేధాన్ని తొలగించకూడదు?

ఇదంతా ఒక నాటకం తప్ప మరొకటి కాదు.

కార్మికుల విషయం

రైల్వేలను నడపడంలో కార్మికులుచూపిన శ్రద్ధను బెంథాల్ప్రశంసించాడు. యుద్ధకృషికి యెక్కువగా తోడ్పడుతూన్నందుకు వారిని అభినందించాడు. బాంబింగ్ జరిగిన సమయాలలో వారుచూపినధైర్యస్థయిర్యాలనుకొనియాడాడు.

కాని, యేటేటా రైల్వేలకు ఇన్నిన్ని కోట్లరూపాయల లాభం సంపాదించి పెడుతూన్న కార్మికులకు (మిగతా 7 వ పేజీ)

మహిళాలోకంలో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది

ప్రథమ గుంటూరు జిల్లా మహిళాసభ

"శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం...." అంటూ ఎవరో శ్లోకం చదువుతున్నారు. సభప్రారంభించబోతున్నా ఇంకా ప్రార్థన చేయరేమిటమ్మా అంటూ ఒకామె మైక్‌వద్దకు వచ్చి ఆశ్లోకం చదివింది. ఒకరివెనుక ఒకరు పాటలు ప్రారంభించారు.— "జోయా! జోహారు లందుకోజోయా...." అంటూ రెండు చక్కని గొంతులు శ్రావ్యంగా కలిసి సభికుల్ని ముగ్ధుల్ని జేస్తున్నాయ్. ఎక్కడి శ్రీరాఘవుడు? ఎక్కడిజోయా? మహిళాలోకం ఎంతముందుకుబోయింది.

ఫిబ్రవరి 9 వ తేదీ తెనాలితాలూకా కంచర్లపాలెంలో ప్రథమ గుంటూరుజిల్లా మహిళా మహాసభ జరుగుతోంది. అరఎకరం స్థలంలో వేసినవిశాలమైనపందిరిలో 1500 మంది స్త్రీలు 500 మంది పురుషులు నిశ్శబ్దంగా వింటున్నారా పాటల్ని. మొట్టమొదట జాతీయోద్యమంద్వారా భారత స్త్రీజాతిలో చైతన్యం తెచ్చిన గాంధిజీ, సామాజికంగానే గాక ఆర్థికంగాగూడ స్త్రీ బానిసత్వంనుండి తప్పించబడాలనీ, "ప్రతివంటకత్తెకూడా రాజ్యమేలగల్గాలనీ" ప్రబోధించిన యుగపురుషుడు లెనిన్ పటాలు వేదికకు సమీపంగా అలంకరించబడి ఉన్నాయి. "ఘోషాపద్ధతి నశించాలి — వితంతువివాహాలు ప్రోత్సహించాలి — రావుకమిటీబిల్లును అమలులోకి తేవాలి — వారసత్వ హక్కులుకావాలి — విడాకుల హక్కులు కావాలి — పురుషులతో పాటు స్త్రీలకు సమాన కూలి ఈయాలి"-అని వ్రాసిన అట్టలు పందిరినిండా వ్రేలాడుతున్నాయి."

ప్రత్యేకత

తక్కిన జిల్లాలకన్న గుంటూరు జిల్లా మహిళాసభకు ప్రత్యేకత ఒకటి ఉంది. అది ఆసభకువచ్చినప్రేక్షకులనుచూస్తేనేబోధపడుతుంది. తెల్లటి ముసుగువేసుకొన్న శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ స్త్రీలు మొదలుకొని, వ్యవసాయకూలీ స్త్రీలవరకు వచ్చారు. అయిదారుగురు ముస్లింస్త్రీలుకూడా వచ్చారు. 80 ఏండ్ల వృద్ధులు మొదలుకొని బాలసంఘ సభ్యులవరకూ ఈ సభకు రాడానికి చూపిన పట్టుదల ప్రశంసనీయం. వేలూరునుండి, కొంతదూరం నడకను, కొంతదూరం రైలులోను, దావులూరునుండి, అనేకమైళ్ల నడిచి వ్యవసాయకూలీలు సభకు వచ్చారు. తెనాలి చుట్టూ అనేక పల్లెలనుండి వ్యవసాయకూలీ స్త్రీలు సభకు వచ్చారు. ఒక్క వినుకొండ మినహా, మారుమూలల తాలూకాలనుండి సైతం, ప్రతితాలూకానుండి ప్రతినిధులు వచ్చారు. మహాసభకువచ్చిన ఈ 1500 మంది స్త్రీలకు అవసరమైన సహాయంచేస్తూ, 60 మంది స్త్రీవలంటీర్లు పనిచేశారు. 'జోయా నగర్'లో, 'హుస్సేన్ బీగేటు'లో కాకినిక్కర్-తెల్లచొక్కా-చేతిలో లాఠీ పుచ్చుకొని వలంటీర్ బాలికలు నిలబడ్డారు. పురుషుల "ప్రత్యేక స్థలం"లోకూర్చున్న ముదుసలి 'ఉప్పలాయ కాలం' అంటున్నాడు. కాదు 'విప్లవం'అంటున్నాడు యువకుడు.

కులమత విచక్షణలేకుండా, రాకపోకల సౌకర్యాలను లెక్కచేయకుండా ఇంతమంది స్త్రీలను ఇచ్చటకు తీసుకురాగల్గినదెవరు: జిల్లా మహిళా ప్రచారకకమిటీకే ఈ గౌరవం అంతా ఈయాలి.

వేరే సంఘ ఆవశ్యకత

నాయకురాలినిగన్న గుంటూరుసీమ స్వాతంత్ర్యోద్యమంలో ఎప్పుడూ ముందంజ వేస్తూనేవుంది. 1920-30-32 ఉద్యమాలలో జిల్లాలోని మహిళలు లాఠీలకు, జైళ్లకు గురియై మహిళాలోకంలో స్వాతంత్రకాంక్ష రగిల్చారు. అసెంబ్లీ ఎన్నికలలో పాల్గొనుట ద్వారా స్త్రీలలో నూతన చైతన్యం ద్యోతకమయింది. కాని దీనికొక నిర్మాణస్వరూపం ఇచ్చినవారులేరు. జిల్లామహిళాసంఘంఅంటూ ఒకటున్నా అది గుంటూరు టౌన్‌క్లబ్‌దాటి బయటికివచ్చిన పాపానపోలేదు. దానిసభ్యత్వరుసుం 3 రూపాయలు. ఇక అది సామాన్య స్త్రీలకెలా అందుబాటులో వుంటుంది?

1942 నవంబరు - జపాను ప్రమాదం హెచ్చుగానున్న రోజులవి. కామ్రేడ్ సుందరయ్య మహిళల కర్తవ్యాన్ని గురించి ప్రబోధించాడు. ఫాసిస్టు ప్రమాదంనుండి రక్షించుకోవలసిన ఆవశ్యకత స్త్రీల కేర్పడింది. మహిళాసంఘాలు నెలకొల్పుకోవాలనే కాంక్ష బయలుదేరింది. గుంటూరుజిల్లాలో కమ్యూనిస్టుపార్టీచే శిక్షణ ఈయబడిన 25 మంది యువతులతో మహిళా ఉద్యమానికి పునాది ఏర్పడింది. ఉద్యోగస్థులతోకూడి గుంటూరులోఉన్న మహిళాసంఘానికి అనుబంధంగా, జిల్లా మహిళా ప్రచారకసంఘంతో పనిచేయడానికి వీరంగీకరించారు. సంవత్సరం పైగా వీరు చేస్తున్నకృషిని హర్షించడంపోయి, మాటిమాటికి పేచీలు పెట్టుకోవడం, నిరుత్సాహపరచడం మొదలుబెట్టారు గుంటూరువారు. అందుచే కలిసి పనిచేయడం అసంభవమై, ఇపుడీ మహాసభ సందర్భంలో వేరుగా మహిళాసభను నెలకొల్పవలసివచ్చింది.

జిల్లామహిళా ప్రచారకసంఘం గావించిన కృషిఏమిటి? 61 గ్రామాలలో 5100 మంది స్త్రీలను సభ్యురాండ్రగా చేర్పించి, 41 గ్రామాలలో ప్రాథమికసంఘాలేర్పర్చింది. 19 గ్రామ సంఘాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఆర్థిక హక్కులు, వైద్యసౌకర్యాలు, మరుగుదొడ్ల సౌకర్యాలు,కావాలని ఆందోళనచేసింది. పఠన కేంద్రాలు, లైబ్రరీల ద్వారా స్త్రీలలో విజ్ఞానం పెంపొందించింది. మహిళావర్కర్లకు తరిఫీదు నీయడానికి మూడు జిల్లా క్యాంపులు నడిపింది. ఇప్పుడు 10 మంది తమ సర్వకాలమూ మహిళా ఉద్యమంలోనే వినియోగిస్తున్నారు. ఇంతేగాక క్షామపీడితులైన బెంగాల్, రాయలసీమ, ప్రజలకు డబ్బు వసూలుచేసి పంపింది. జిల్లామహిళా ప్రచారకకమిటీ కృషి ఫలితంగానే, నేడుకోటమరాజు సుబ్బమ్మ, నోరి లక్ష్మమ్మ లాంటి వయోవృద్ధులు మహిళా ఉద్యమానికి అండగా నిలవడం సంభవించింది.

ఇంత కృషిగావించిన మహిళాసంఘం, వేలకొలది స్త్రీలను సభకు తీసుకురాగల్గిందంటే ఆశ్చర్యం ఏముంది?

రాష్ట్ర మహిళాసంఘ ఆర్గనైజర్ మానికొండ సూర్యావతిగారు,మహిళాసభ ప్రారంభకురాలు డాక్టరు అచ్చమాంబగారు వేదికనలంకరించారు. మొదట ఆల్లిక పోటీ జరిగింది. తర్వాత రాట్నపు పోటీ జరిగింది. జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి హనుమంతరావుగారి పెదతల్లి బసవమ్మగారు ఆపోటీలో పాల్గొని ఇతరులను ప్రోత్సహించారు. "అబ్బాయి! నాకళ్ళజోడు మరచిపోయాను కాని లేకపోతే నాకే మొదటిప్రైజ్ వచ్చేది" అని అంది. ఆపోటీలో రెండవ బహుమానం రావడమే ఆమె అన్న మాటలు నిజమని రుజువుచేస్తున్నాయి. ఈ సమయంలోనే సంగంజాగర్లమూడినుండి అతిసన్నంగా వడికిన నూలు చిలపలను నిప్పెపెట్టెలోపెట్టుకొని మహిళలు తీసుకొచ్చారు. వీటిని వడికినవారు ప్రత్యేక ప్రశంసకు గురిఅయ్యారు.

వేదికపై 'స్టాలిన్లు'

ఈ పోటీలకేమి లెండి. అదిగో వస్తున్నారు అగండి, స్టాలిన్! ఒక్కరు కాదే - ముగ్గురు స్టాలిన్‌లు, రణదివే, సరోజినీదేవి, జోయా, కల్పనాదత్తు - ఇంకా అభ్యుదయ రచయిత - ప్రేమ్‌చంద్, వేదికపైకి వచ్చారు. గాభరాపడకండి. వీళ్ళంతా శిశుప్రదర్శనంలో పోటీకివచ్చిన శిశువులు, పేర్లలో ఎంతమార్పు?

తర్వాత పతాకోత్సవంజరిగింది. 'స్వాతంత్ర్యం—శాంతి—అభ్యుదయం' అని వ్రాసియున్న మహిళా జండాను చంద్ర సావిత్రి దేవిగారు ఎగురవేసి, దాని ప్రాముఖ్యతను తెలియజేశారు. వి. బసవపూర్ణమ్మగారు ఆహ్వానసంఘం తరపున మాట్లాడుచూ వివిధగ్రామాలలో ఈ మహాసభకు గావించిన తోడ్పాటును గురించి ప్రసంగించారు. డాక్టర్ అచ్చమాంబగారు ప్రారంభోపన్యాసం గావించారు. నేడు మన సమాజంలోని స్త్రీల పరిస్థితులు - కష్టాలను వివరించి, స్త్రీసంఘాలతో వాటిని తొలగించుకోవాలనిచెప్పారు. జాతీయ



మానికొండ సూర్యావతి

వుద్యమం, ఆతర్వాత కమ్యూనిస్టు ఉద్యమం, స్త్రీలలో ఎలా రాజకీయ చైతన్యం గలిగించిందో వివరించారు. ప్రస్తుత దేశపరిస్థితులను వివరించుతూ, హిందూ ముస్లిం ఐక్యత లేనందువల్ల, దేశనాయకులు జైళ్ళలో నున్నందువల్ల ఆహారసమస్య బెంగాలులో అంతగా విషమించిందనిచెప్పారు. కరువువల్ల ఎక్కువ నష్టపడింది స్త్రీలు, పిల్లలు, అని చెప్పారు. ఐక్యతవల్ల స్వాతంత్ర్యం ఎలావస్తుందో, స్వాతంత్ర్యం గలిగిన దేశాలలో స్త్రీల అభివృద్ధి ఎలావుంటుందో, కథలద్వారా ఉదాహరణలిస్తూ వివరించారు.

అధ్యక్షత వహించిన సూర్యావతిగారు మొదట దేశంలోని ప్రతిష్టంభన, కరువులను, గురించి క్లుప్తంగా వివరించారు. కరువు మూలంగా స్త్రీల కుటుంబ బాంధవ్యాలే నశించిపోతున్నాయని, మానవత్వమే అడుగంటిపోతున్నదని తెలియజేశారు. అధికోత్పత్తికి, తినుబండారాలను పొదుపుగా వాడుతూ సహాయపడాలన్నారు. స్త్రీలకువారసత్వహక్కులు, ఆస్తిహక్కులు, విడాకుల హక్కు, విధవలకు పునర్వివాహ హక్కులు ఎందుకు అవసరమో వివరించుతూ చక్కగా ఉపన్యసించారు.

విశాఖపట్టణం, పశ్చిమ గోదావరులనుండి సౌహార్ద్ర ప్రతినిధులువచ్చి సందేశాలిచ్చారు. వివిధమతాలమధ్య సామరస్యం కోసం కృషి చేస్తూ శాంతి ఆశ్రమం నడుపుతున్న ఖాసిం అల్లీఖాన్ ఐక్యత ఆవశ్యతగురించి సందేశం పంపారు.

స్త్రీలు - కమ్యూనిస్టుపార్టీ

సాయంత్రం 5 గంటలయింది. ఎంతో సేపు ఎన్నో అంశాలను చూస్తూ, వింటూ కూర్చున్నా అలసటలేకుండా ఇంకా వినాలనే కుతూహలం, పట్టుదలతో స్త్రీలుకూర్చున్నారు. అలాంటి సమయంలో కమ్యూనిస్టుపార్టీ తరపున సందేశ మివ్వడానికి కామ్రేడ్ సుందరయ్య లేచాడు.

"కమ్యూనిస్టుపార్టీ కష్టపడే వారికోసం, బీదలకోసం పాటుబడుతుంది. మనసమాజంలో ఎక్కువ కష్టాలుపడేది స్త్రీలు - పిల్లలు, అందుచే స్త్రీల హక్కులకోసం, బిడ్డల సౌకర్యాలకోసం కమ్యూనిస్టుపార్టీ కృషిచేస్తూ వుంది. నాతల్లి, అక్కచెల్లెండ్రుపడే బాధలను చిన్నప్పటినుండీ నే నెరుగుదును. వీరి కష్టాల నివారణకు మార్గమేదో నాకప్పుడు తెలియదు. కాని తర్వాత సోవియటు యూనియన్ స్త్రీలకు, బిడ్డలకు గావించిన సౌకర్యాలను విన్నాను. నేను కమ్యూనిస్టుపార్టీలోకి ఆకర్షింపబడటానికి ఒక కారణం, స్త్రీలకు బిడ్డలకు ఇలాంటి సౌకర్యాలను గలిగించినది కమ్యూనిస్టుపార్టీయేనని తెలిసికోవడంవల్లనే." అంటూ ఉపన్యసించారు. తర్వాత సోవియటు స్త్రీలకుగల హక్కులను, సౌకర్యాలను వివరించుతూ, సోవియటు సమాజం వంటిది నిర్మించడానికే కమ్యూనిస్టుపార్టీ ప్రయత్నించుతుందని చెప్పారు. సుందరయ్యగారి ఉపన్యాసం కరతాళధ్వనులమధ్య ముగిసింది.

వివిధ తాలూకాలనుండి వచ్చిన 67 గురు ప్రతినిధులు 9-10 తేదీలలో దీర్ఘంగాచర్చించి ఈ క్రింది తీర్మానాలు గావించారు.

తీర్మానాలు

1. హుస్సేన్‌బీ (బెజవాడ), ఆర్.యస్. పండిట్, ఫణిచక్రవర్తి మొదలగు వారి మరణానికి చింతిలుతూ సంతాప తీర్మానం. 2. ఫాసిస్టులను ప్రతిఘటించి ప్రపంచ దాస్య విముక్తికి, స్త్రీలదాస్యవిముక్తికి,పోరాడుతున్న సోవియటు-చైనా - యుగోస్లావియా మహిళలకు జోహారులర్పించుట. 3. స్త్రీలకు సమాన వారసత్వపుహక్కును, రెజిస్ట్రేషన్ వివాహ పద్ధతిని, విడాకులహక్కును, గుర్తిస్తూ, హిందూ లా సవరణబిల్లు 1944 జూన్‌లోగా శాసనం చేయబడాలి. 4. ప్రతి గ్రామంలోను స్త్రీలకు మరుగుదొడ్లు,తరిఫీదుపొందిన మంత్రసానులు, బాలికా పాఠశాలలు, ఉండేటట్లు స్థానికసంస్థలు చర్యతీసుకోవాలి. 5. స్త్రీలచే గనులలో పనిచేయించరాదు. గ్రామాలలో స్త్రీలకు పురుషులతోబాటు సమానకూలి యివ్వాలి. 6. స్త్రీలు ఆరోగ్యకరమైన వంట పద్ధతు లవలంబించాలి. పదార్థాలను పొదుపుగా వాడాలి. 7. దేశాన్ని ఫాసిస్టు ప్రమాదంనుండి, కరువురాక్షసినుండి, కాపాడుటకు అన్ని రాజకీయపార్టీలు ఐక్యతతో జాతీయ నాయకుల విడుదలకు, జాతీయప్రభుత్వ స్థాపనకు పనిచేయాలి. 8. శిశుపోషణలోను, గర్భిణీ స్త్రీలూ అవలంబించవలసిన మంచి పద్ధతులను గురించి. 9. మద్రాసు ప్రభుత్వం మద్యపాన నిషేధచట్టాన్ని తిరిగి అమలులో పెట్టాలి. 10. ఆహారం ప్రజలందరికీ సక్రమంగా అందజేయుటకు, ఫాసిస్టు ప్రమాదం నుండి తాము రక్షించుకోడానికి, స్త్రీలు విరివిగా వాలంటీరు దళాలలో చేరాలి. 11. బాలబాలికలకు చక్కని శిక్షణ ఇవ్వడానికి స్త్రీలు బాలసంఘాల నిర్మాణానికి తోడ్పడాలి. 12. గుంటూరు పురపాలకసంఘం స్త్రీల కళాశాల నిర్మాణానికి పూనుకొన్నందుకు అభినందించుతున్నారు. స్త్రీలకు ప్రత్యేక హాస్టల్ నిర్మించాలి. ఉచితవిద్య గరపాలి.

సోవియట్ ప్రదర్శనం

సోవియటు ప్రదర్శనశాలను గురించి రెండుమాటలు చెప్పాలి. పందిరిలో ఒక భాగం ఇందుకు ప్రత్యేకంగా వినియోగించబడింది. సోవియట్ యూనియన్‌లోని బాలబాలికలు, యువతులు, మహిళలు, యుద్ధవీరులబొమ్మలు సేకరించారు. లెనిన్ బాల్యంనుండి వివిధదశలలోని ఫోటోలు ఒకచోట ప్రదర్శించారు. అన్నిటికన్న వీరయ్యగారు వ్రాసిన జోయాచిత్రాలు (మిగతా 4 వ పేజీ)

రైతుమహాసభకు వచ్చే ప్రయాణీకులకు హెచ్చరిక

గ్రామాలలో మహాసభనుగూర్చిప్రచారం చేస్తున్నప్పుడు అనేక వేలమంది ప్రజలు మహాసభకు వస్తామని వుత్సాహం వెళ్ళబుచ్చుతున్నారు. ముఖ్యంగా, కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలలో మారుమూలల నుండికూడా గ్రామాలు. గ్రామాలు కదలి వచ్చుట కుత్సాహపడుచున్నారు. అయితే ఎవరిమట్టుకువారు రైళ్ళమీదనో,కార్లమీదనో, ఎట్లాగోఅట్లా తంటాలుపడి చేరుకుందామనుకుంటున్నారు. కాని ఇది చాలా పొరపాటు అభిప్రాయం. ఇన్నివేలమందికి కార్లు, రైళ్లు, దొరకటం అసంభవం. ఇంతమంది ఒకేసారి బయలుదేరటంవల్ల, కార్లు, రైళ్ల పట్టవు. ఎవరికివారే ముందు గా బయలుదేరుదామనుకున్నా అంతే. పైగా ముందుగా బెజవాడవచ్చి కూర్చుంటే,వసతులులేక ఇబ్బందిపడాలి. మహాసభకు రెండురోజులకే (14, 15 తేదీలు) వసతు లేర్పాటు చేయబడతాయి.

కార్లు త్రోవలోచెడిపోతే అసలుకేమోసం వస్తుంది. కాబట్టి కార్లను నమ్మవద్దు. రైళ్ళలో కూడాటిక్కెట్లుదొరకకపోవచ్చు. కాబట్టి ప్రతివారు కాలినకనో, గుడిసెబళ్ళమీదనో, పడవలమీదనో వచ్చేందుకు ప్రయత్నించాలి. ఎంత దూరమైనా తిరునాళ్ళకు బళ్లకట్టుకొని వెళ్ళినట్లుగానే మహాసభకు బళ్లకట్టుకొని రావాలని ప్రార్థన. చక్రంకట్టిన బండికి ఎర్రజండా కట్టండి. పడవలమీద ప్రయాణముచేయదలచుకొన్నవారు, రానుపోను ముందుగానే మాట్లాడుకోవటం మంచిది.

13 వ తేదీ అర్ధరాత్రికల్లా మహాసభ స్థలానికి చేరుకోవాలి. అంతకు ముందుగా రావద్దు. భోజనాలకై వుప్పు, పప్పు, బియ్యం, పాత్రసామగ్రి మొదలయినవి తెచ్చుకోండి. కొంతమందికిమాత్రమే ఆహ్వానసంఘం మూల్యానికి భోజనవు ఏర్పాట్లుచేయుచున్నది.

మీరు వచ్చేటప్పుడు, మజ్జిగ, వచ్చళ్లవి స్తళ్ళ వున్నంతతెచ్చి ఆహ్వానసంఘానికిస్తే ఎంతో సహాయం చేసినవారవుతారు.

ఇట్లు,
చలసాని వాసుదేవరావు,
ఆహ్వానసంఘాధ్యక్షుడు.

రైతుమహాసభకు వస్తున్న నాయకులు

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ పి. సి. జోషీ: అఖిలభారత కిసాన్‌సభ అధ్యక్షుడు కామ్రేడ్ బంకింముఖర్జీ: అఖిలభారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి స్వామి సహజానందసరస్వతి; జీవితమంతా విప్లవపోరాటాల్లో గడిపిన పంజాబ్ రైతునాయకుడు, 80 ఏళ్ళ వృద్ధమూర్తి బాబాసోహన్‌సింగ్‌భాక్నా: ఆసియాఖండంలో సాటిలేని విజ్ఞానవేత్త కామ్రేడ్ రాహుల్‌సాంకృత్యాయన్ మొదలయిన ప్రముఖనాయకులెందరో బెజవాడలో జరుగనున్న అఖిలభారత రైతుమహాసభ వేదిక నలంకరింప రానున్నారు. వారి ఉజ్వలసందేశాలను వినే సదవకాశం ఆంధ్ర రైతాంగానికి లభిస్తుంది.

అఖిలభారత రైతుమహాసభకు వసూళ్లు

(18-2-44 వరకు)

	రు. అ. పై.
క్రిందటిసంచికలో ప్రకటించినమొత్తం	8427—2—3
అనకాపల్లి (విశాఖ)	8—14—0
తూ. గో. జిల్లారైతుసంఘం	134—0—0
ప. గోదావరి	
పెనుగొండ	64—0—0
మల్లేశ్వరం	20—0—0
రవపురం	80—0—0
చింతలపూడి	19—0—0
ముదిచర్ల	66—9—6
ప్రగడవరం	1—0—0
ఏలూరు	12—1—0
పెదపాడు	207—0—0
పోతునూరు	55—0—0
కృష్ణా	
మోపర్రు	60—0—0
గణపవరం	20—0—0
కాటూరు	1055—0—0
ఆత్కూరు	516—0—0
అల్లాపురం	30—0—0
పొట్టిపాడు	234—8—0
బెజవాడ	17—1—9
తేలప్రోలు	100—0—0
కుందేరు	150—0—0
వెల్వడం	8—12—5
పటమట	106—0—0
ఎనమలకుదురు	7—0—0
ముస్తాబాద	15—0—0
సావరగూడెం	55—0—0
మెట్లపల్లి	75—0—0
ఎనికేపాడు	146—0—0
పెనమలూరు	100—0—0
వక్కలగడ్డ	80—0—0
కురుమద్దాలి	87—0—0
భట్లపెనుమర్రు	100—0—0
మేకావారిపాలెం	140—0—0
వెంట్రప్రగడ	100—0—0
వెల్దిపాడు	240—0—0
కొయ్యగూర్రపాడు	161—0—0
వేంపాడు	50—0—0
గంపలగూడెం	116—0—0
ఆఫీసుద్వారా	1—0—0
అనంతపురం	
అనంతపురం	80—0—0
కడప	
కడప	26—10—0
గుంటూరు	
పెదవడ్లపూడి	67—0—0
మొత్తం	13038—10—11

(3 వ పేజీ తరువాయి) మూడూ ప్రదర్శనశాలకంతకూ వన్నెతెచ్చాయి. ఇద్దరుమహిళా వర్కర్లు ఆ పటాలను వివరించుతూ ఉండేవారు.

ప్రతినిధుల ఉత్సాహాన్ని తెలియజేయడానికి మహిళాసంఘానికి సభలోకి వచ్చిన విరాళాలే నిదర్శనం. 2 వెండిపట్టాలు, ఒక బంగారు గాజు, 2 పోగులు, 2 ముద్దెలు, పదిరూపాయలు ఘల్లున వేదికపై మ్రోగాయి.

9 వ తేదీ రాత్రి వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. 3000 వేలమంది స్త్రీలు, 1000 మంది పురుషులు చూడటానికి వచ్చారు. వీటిలో పాల్గొన్నది ఎక్కువ బాలసంఘాలే. సమిష్టిగానాలు, కోలాటంపాటు, గెరిల్లాపాట, అన్నాచెల్లెలుపాట, వీధిభాగవతం, లంబాడీడాన్సు మొదలైనవి జరిగాక, జిల్లామహిళా దళం టాన్యా బుర్రకథ చెప్పింది. క్రాప బాలసంఘం ఎక్కువ అంశాలను ప్రదర్శించి నేర్పు చూపడంవల్ల, దళంలో సమిష్టితత్వాన్ని బాగా అలవరచుకోవడంవల్ల, ప్రథమబహుమతి పొందింది. లంబాడీ డాన్సుతో ప్రజల్ని ముగ్ధపరచిన అమృతలూరు బాలసంఘం రెండవ బహుమానం పొందింది. దావులూరి బాలికలు, పణిదం బాలసంఘ నాయకుడు ప్రత్యేక బహుమానాలుపొందారు. బుర్రకథలపోటీలలో పాల్గొన్న క్రాప, రేపల్లి తాలూకా మహిళా సంఘాలు చక్కని అభివృద్ధిచూపుతున్నాయి. వేదిక నెక్కి కథ చెప్పడం ఇదే మొదటిసారైనా, క్రాప మహిళాదళంలో కథచెప్పిన మంత్రవాది కమలాందగారు, ఆ రెండునిమిషాలపాటు భరతమాత స్తోత్రంతో ప్రేక్షకుల్ని తన్మయుల్ని చేశారు. వైజ్ఞానిక ప్రదర్శనాల ద్వారా ఎందరెందరో బాలబాలికల, యువతుల కళా ప్రతిభ ద్యోతకమవుతోంది. దానికి చక్కని మెరుగులిచ్చి, దేశసేవకు, మహిళా సమాజ ఉద్ధరణకు, పాటుపడాలి, అని అనుకుంటూ జిల్లా మహిళలు సభను ముగించారు.

జిల్లామహిళాసభ, స్త్రీలలో నూతన ఉత్సాహాన్ని వెల్లివిరియజేసింది. స్వతంత్ర భారతదేశంలో నూతన నిర్మాణానికి పూనుకోవాలనే దృఢకాంక్షతో స్త్రీలు వెళ్ళిపోయారు.

ఆంధ్ర సైంటిఫిక్ కార్మికులపై నిర్బంధాలు

ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ (బందరు) కార్మికులు సంఘం పెట్టుకున్నారనే కసితో కార్మికనాయకుల్ని ఎనమండుగురిని పనిలోనుంచి తీసివేశారు. నలుగురిమీద తప్పుడు నేరాలు మోపి అరెస్టుచేయించారు. కార్మికులను తిట్టడం, కొట్టడం సాగించారు. ఇలా దౌర్జన్యంగా ప్రవర్తించి కార్మికులను సమ్మెకు రెచ్చగొట్టారు. 550 మంది కార్మికులు ఈ నెల 8 వ తేదీనుంచి ఏకముఖంగా యజమానుల నెదిరించి, తమ హక్కులకోసం పోరాడుచున్నారు. సమ్మెను భగ్నంచేయడానికి యజమానులు వేస్తున్న ఎత్తుగడలన్నిటినీ చలించకుండా ఎదుర్కొంటున్నారు.

పోలీసు జులుం

ఇంతలో పోలీసుజులుం ప్రారంభమైంది. కమ్యూనిస్టుపార్టీ బందరు పట్టణకమిటీ కార్యదర్శి అయిన వి. జి. కృష్ణను, సైంటిఫిక్ కంపెనీ పనివారల సంఘంలో ఎక్కువగా క్షోభ్యం కలిగించుకొంటున్నాడని నేరంమోపి అరెస్టుచేశారు. కార్మికులు సభలు, ఊరేగింపులు జరపకూడదని నిషేధించారు. అంతటితో ఆగలేదు. బలమయిన పోలీసు సిబ్బందులు కార్మికులు నివసించే ప్రాంతాలను చుట్టేసి, పట్టుదలతో పనిచేస్తున్న కార్మికులనందరిని అరెస్టుచేయడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మికులఆందోళనను ఇది మరింత హెచ్చు చేస్తూంది. తమ న్యాయమైన హక్కులకోసం నిలబడిన కార్మికులను ఈ విధంగా బెదరగొట్టడం, కంపెనీయజమానులు సాగించిన దౌర్జన్యాలను బలపరచడమన్నమాటే. ఉత్పత్తి విషయంలో యజమానులు సాగిస్తున్న అరాజకానికి చేయూత నివ్వడమన్నమాటే. ఈ అక్రమాలను ఎప్పటికప్పుడు లేబరు కమీషనరుకు, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినా, వారేమీ కలుగజేసుకోవడం లేదు. ఈ మూగతనం ఉత్పత్తి కెలా నష్టం కలిగిస్తున్నదో వీరు వెంటనే గ్రహించి, పరిష్కారానికి పూనుకోవాలి.

—యూనియన్ను గుర్తించాలనీ,

—తీసివేసినకార్మికులను వెంటనే పనిలో పెట్టుకోవాలనీ,

—అక్రమకేసులు ఉపసంహరించుకోవాలనీ,

—ప్రభుత్వంప్రకటించిన రు 8-8-0 కరువుభత్యం ఇవ్వాలనీ,

—రెండుజతల దుస్తు లివ్వాలనీ,

—టిఫిన్‌షెడ్డు కట్టించాలనీ,

—సమ్మెదినాలకు వేతనం ఇవ్వాలనీ—

కార్మికులు కోరుతున్నారు. ఇతర కార్మిక సంఘాలన్నీ,ప్రజలు ప్రజాసంస్థలు ఈకోర్కెలను బలపరచి, అధికారులపై ఒత్తిడితేవాలి.

బెజవాడ మ్యునిసిపల్ కార్మికుల విజయాలు

రు. 8-8-0 కరువుభత్యం కోసం, డ్రైయినేజి పంపింగు స్టేషనునుండి తొలగించిన 4 గురి కార్మికుల్ని తిరిగి పనిలోకి తీసుకోవాలని - ఇంకా ఇతరకోరికలకై బెజవాడ మ్యునిసిపల్ కార్మికులు సుమారు నాలుగు మాసాలనుంచి తీవ్రాందోళన జరుపుతూ వచ్చారు. నేటికి విజయం సాధించారు. మొన్న 17 వ తేదీని అధికారులు ఈ దిగువ కోర్కెలను అంగీకరించారు.

– డిసెంబరునుండి ప్రభుత్వంప్రకటించిన 8-8-0 కరువుభత్యం ఇచ్చుట,

– డ్రైయినేజ్ పంపింగు స్టేషన్‌నుండి తొలగించిన నలుగురిని చేర్చుకొనుట

– పార్కు వర్కర్లకు, రోడ్డుకూలీలలో, పర్మనెంటు వర్కర్లకు జనవరినుండి ప్రావిడెంటుఫండు అమలు జరపడం

– మస్తర్లవద్దనే జీతాలివ్వడం,

కార్మికుల ఇతరకోరికలపై రాయబారాలు జరుగుతున్నాయి. తమకు దుస్తులివ్వాలనీ, తమ బిడ్డలకు తగిన విద్యా సౌకర్యాలు కలిగించాలనీ, దొడ్లు తుడిచేవారికి ఒక్కొక్కరికి 40 దొడ్లు మాత్రమే నిర్ణయించాలనీ, వర్కర్లకు ప్రత్యేక అనుపత్రి కావాలనీ, కార్మికుల కోరిక. ఐకమత్యంతో కృషిచేస్తూ ప్రజలసానుభూతిని సంపాదించినట్లయితే ఈ కోరికలన్నీ తప్పక నెరవేరగలవు.

మధిరగోదాంఏజంట్ల అక్రమచర్యలు

నైజాం ప్రభుత్వం అమలుపరచిన ధాన్యసేకరణస్కీము ననుసరించి మధిరకు ధాన్యం తీసుకురావలెనంటే, 50 లేక 60 మైళ్ళనుండి తీసుకురావాలి. రైతులు బండ్లు కట్టుకొని, ధాన్యం మధిరకు చేర్చుతున్నారు. కాని, గోదాముల్లో ప్రభుత్వ ఏజంట్లు నాలుగైదు రోజుల వరకు తూకం వేయకుండా ఉంచుతున్నారు. ధాన్యంలో మట్టి ఉన్నదనే సాకుతో పరిశీలించకుండానే బస్తా 1 కి 4, 5 శేర్లు చొప్పున తగ్గించుకొంటున్నారు. కొన్ని సందర్భాలలో పొల్లుఉన్నదని, నల్లవడ్లు ఉన్నవని, తగ్గించుకొంటున్నారు. ఈ విధంగా తిరస్కరించ బడిన ధాన్యాన్ని గోదాము ఏజంట్లు రైతులకైనా తిరిగి యివ్వక, దొంగ మార్కెటులో అమ్మి ధనం సంపాదించుకొంటున్నారు. ఉదాహరణకు 4-2-44 వ తేదీ రాత్రి గం. 9 లకు ఆంధ్రమహాసభ ఆర్గనైజరు వానిరెడ్డి వెంకటపతిగారు, మరికొందరు వర్కర్లు, గోదాములోనుండి ధాన్యపు బస్తాలు బండ్లమీద వేస్తూంటే చూచి, రెండుబండ్లు స్టేషన్ రోడ్డున వెళ్తూంటే పట్టుకున్నారు. ఆబండ్లమీద హైదరాబాదు కమర్షియల్ కార్పొరేషన్‌వారి పేరుతో 14 బస్తాలున్నాయి. వెంటనే యీ విషయం తహసీల్దారుతో ఫిర్యాదుచేయగా, ఆయన పోలీసుల్ని పంపించి, సరుకును తాలూకా ఆఫీసులోఉంచారు. అదే సమయాన ఆంధ్రమహాసభ వర్కర్లు తిరిగి గోదామువద్దకు రాగా, 26 బస్తాలలో ధాన్యంమూటలు కట్టి యెక్కడికో ఎత్తించుకొని పోతున్నారు. వెంటనే వాటిని ఆటంకపరచి, పోలీసులకు స్వాధీనంచేశారు. మరునాడు యీ విషయాలన్నీ తెలియజేస్తూ ఆంధ్ర మహాసభ నాయకులు నైజాం ప్రధాన మంత్రికి, యితర పైఉద్యోగస్తులకు దరఖాస్తులు పంపించారు.

ప్రభుత్వంచే నియమించబడిన కంట్రాక్టర్లే యీ విధంగా ప్రభుత్వ ధాన్యసేకరణ స్కీమును తమ స్వలాభంకొరకు ఉపయోగించుకొంటున్నారు. ప్రజల్ని కరువునుండి కాపాడుటకు యిట్టి స్వార్థపరుల దొంగవ్యాపారాన్ని అరికడుతూన్న ఆంధ్రమహాసభవార్ని అభినందిస్తున్నాం.

రాయలసీమలో కాటక పరిస్థితులు

11-2-44 వ తేదీని కర్నూలుజిల్లా రైతుసంఘం తరపున ఒక రాయబారవర్గం జిల్లా కలెక్టరును సందర్శించి, జిల్లాయందలి కాటక పరిస్థితుల్ని తొలగించుటకు యీదిగువ అంశములతోగూడిన ఒక మెమోరాండం సమర్పించారు.

ప్రతి ఫిర్కాకు కనీసం 3 కో-ఆపరేటివ్ స్టోర్సు స్థాపించాలి. స్టోర్సు పెట్టుబడి రు. 2000 నుండి రు. 1000 కు తగ్గించాలి. స్టోర్సును రిజిష్టరు చేయడంలో ఆలస్యం ఉండకూడదు. 2300 టన్నులనుండి 1000 టన్నులకు తగ్గించబడిన కర్నూలుజిల్లా కోటాను తిరిగి 2300 టన్నులకు పెంచాలి. ధాన్యం కొరతప్రాంతాలలో చౌకడిపోలు తెరవాలి. స్టోర్సులేనిచోట్ల ఆహారకమిటీలకు, రైతుసంఘాలకు సరుకును అమ్మే అధికారం ఇవ్వాలి. కిరసనాయిలు ప్రతి యింటికి 2 సీసాలైనా యివ్వాలి. కర్నూలు జిల్లాకు కనీసం 1000 టన్నుల ఇనుం వచ్చేలాగు చెయ్యాలి. వర్తకులవద్దనున్న గానుగపిండిని (వేరుశనగపిండి) ప్రభుత్వం స్వాధీనపరచుకొని, వ్యవసాయశాఖద్వారా అమ్మించాలి. ఫిర్కాకు ఒక యెరువులడిపో తెరవాలి. గ్రామాలలో పనిచేస్తున్న ఆహారకమిటీలను ప్రభుత్వం గుర్తించాలి. జిల్లా ఆహారకమిటీలో జిల్లా రైతుసంఘానికి ప్రాతినిధ్యం ఉండాలి.

ఉరవకొండ తాలూకాలో కరువు పరిస్థితి

9-2-44 వ తేదీని అనంతపురం జిల్లా ఉరవకొండ తాలూకా రైతుసంఘం పత్తిపాటి రంగప్పనాయుడుగారి అధ్యక్షతకింద సమావేశమై, యీక్రింది విషయాలపై తీర్మానాలు గావించింది:

1. తాలూకాలో కొర్ర, సజ్జ, జొన్న మొదలయిన ఆహారపంటలు చాలావరకు నాశనమై కరువుపరిస్థితి యేర్పడ్డంవల్ల శాశ్వత కరువు నివారణకు చెరువులు, కాలువలు, బావులు, రిపేరు చేయించి, తుంగభద్ర, కుముద్వతి ప్రాజెక్టులపని వెంటనే ప్రారంభించాలి, రైతులకు శిస్తురెమిషన్ ఇవ్వాలి.

2. ఆహారపదార్థాలు ప్రజలకు సక్రమంగా అందుటకు ప్రభుత్వం విరివిగా కో-ఆపరేటివ్ స్టోర్సును స్థాపించాలి.

3. అధికాహారోత్పత్తికి నాగసముద్రం చెరువు, ఎద్దులపల్లె రామగిరిచెరువు, శేఖసానిపల్లెచెరువులకు వక్కరేణులుకట్టి, నీటిని విలువచేసినయెడల 500 యకరముల భూమి సాగు అవుతుంది. ఇంకా కొంత బంజరు భూమినికూడా సాగుచేయవచ్చును.

4. వ్యవసాయాని కవసరమైన పనిముట్లు కో ఆపరేటివ్ స్టోర్సుద్వారా ప్రభుత్వం కంట్రోల్ ధరలకు అమ్మించాలి.

అనంతపురం తాలూకా రైతుసంఘ సూచనలు

అనంతపురం తాలూకా రైతుసంఘ జనరల్‌బాడీ 8-2-44 వ తేదీని సుంకు రంగప్పగారి అధ్యక్షతకింద సమావేశమై యీ క్రింది తీర్మానాలను ఆమోదించింది.

1. జిల్లాలో మాటిమాటికి వస్తూయున్న కరువును పోగొట్టుటకు ప్రభుత్వంవారు వెంటనే పెన్నారు, కుముద్వతి ప్రాజెక్టులను, పేరూరు-భానుకోట ప్రాజెక్టులను, భైరవానుతిప్ప ప్రాజెక్టును, నిర్మించుటకు పూనుకోవలసియుంది.

2. తాలూకా ప్రజలకు ఆహారపదార్థాలందజేయుటకు ప్రభుత్వం విరివిగా కో ఆపరేటివ్ స్టోర్సు తెరచి, తక్కువ ఖరీదుకు ధాన్యం సప్లయి చేయాలి. గ్రామస్థుల శక్తిని బట్టి మూలధనం సేకరించాలి.

అనకాపల్లి తహసీల్దారు అక్రమచర్య

లోగడ మద్రాసు ప్రభుత్వం తుమ్మపాల (విశాఖజిల్లా) పంచదార ఫ్యాక్టరీ ఏరియాలో 16 గ్రామాలకు చెరుకుఆట నిషేధిస్తూ ఉత్తరువులు జారీచేసింది. కాని, స్థానిక తహసీల్దారు తన సొంత అధికారంతో మూలపేట, మంగళవరపుపేటలకు కూడా పై ఉత్తరువు వర్తిస్తుందని దండోరా వేయించాడు. రైతులు చెరకు ఆడుతూండగా పోలీసులు ఆటంకపరచి, బెల్లంపెనం వగైరా స్వాధీనం చేసుకున్నారు.

ఈ అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొనుటకు తాలూకా రైతుసంఘ వర్కర్లు కలెక్టరువద్దకు వెళ్ళి, గానుగఆడుటకు అనుమతిని తీసుకొచ్చారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్లు తహసీల్దారు గానుగఆడేవారందరి పేర్లు వ్రాసుకొని ప్రాసిక్యూట్ చేస్తానని బెదరించాడు. రైతులు భయపడక, తహసీల్దారు ఉత్తరువును ధిక్కరించారు. కలెక్టరు ఆర్డరును పోలీసువారికి చూపగా, యిదివరలో వారు స్వాధీనం చేసుకొన్న పరికరాలను తిరిగి ఇచ్చివేశారు.

ఒకచోటా స్థానికాధికారి యీ విధంగా జిల్లాకలెక్టరు ఉత్తరవులను ధిక్కరించి, తన యిష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తుంటే, పై ఉద్యోగస్తులు ఊరుకోవడం ఉచితంకాదు. అనకాపల్లి తహసీల్దారుపై తగినచర్య తీసుకోవలసిందని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

రైతుసంఘ సమావేశాలు

10-2-44 వ తేదీని నూతన ప, గోదావరి జిల్లా రైతుసంఘ సాధారణ సభ్యులు గణపవరంలో పేటేటి వెంకటరత్నంగారి అధ్యక్షతను సమావేశమై, కొత్త సంవత్సరానికి ఉద్దరాజు సూరపరాజుగారిని అధ్యక్షులుగాను, అన్నే వెంకటేశ్వరరావుగారిని ప్రధాన కార్యదర్శిగాను, ఎన్నుకున్నారు. గారపాటి సత్యనారాయణ, వంకినేని సత్యనారాయణ గారలు సహాయ కార్యదర్శులు. మరి 11 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

కానూర్రు, పెండ్యాల పంపింగుస్కీములను అమలుపరిస్తే రైతులకునష్టంఅంటూ ఐ.ఎల్.టి. డి. పొగాకు కంపెనీవారి ప్రోత్సాహంతో కొద్దిమంది రైతులు ప్రభుత్వానికి అర్జీపెట్టినట్లు, దీన్ని సాకుగా తీసుకొని జిల్లాకలెక్టరు యీ స్కీములను ఆచరణకు తేరాదని ప్రభుత్వానికి సిఫార్సుచేసినట్లు, తెలుస్తోంది, రైతువ్యతిరేకుల ప్రోత్సాహంతో వచ్చిన అర్జీలను ఆధారంగా తీసుకొని, కనీసం 1 లక్ష 10 వేల బస్తాల పంటకు అనువైన స్కీములను ఆపివేయ వద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ తీర్మానించారు. అఖిలభారత రైతుమహాసభకు 13 రిని డెలిగేట్లుగా ఎన్నుకున్నారు.

కృష్ణాజిల్లా రైతుసంఘం

ఫిబ్రవరి 10 వ తేదీని నూతన కృష్ణాజిల్లా రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశం బెజవాడలో అనుమర్లపూడి సీతారామారావు గారి అధ్యక్షతకింద జరిగింది. అన్ని తాలూకాలనుండి 100 మంది జనరల్‌బాడీ సభ్యులు, 50 మంది సౌహార్ద్ర ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రరైతు సంఘాధ్యక్షులైన కడియాల గోపాలరావుగారు, శాసనసభా సభ్యులైన కాట్రగడ్డ వెంకటనారాయణరావుగారు, రాష్ట్రసంఘ సహాయకార్యదర్శి ముక్కామల నాగభూషణంగారు, ఉపన్యసిస్తూ రైతుసంఘాలనూ, రైతుఉద్యమాన్ని విచ్ఛిన్నంచేయుటకు పోటీసంఘాలు స్థాపించి, విశ్వప్రయత్నాలు చేస్తూన్న వ్యతిరేక శక్తుల్ని నిరంతరాందోళన ద్వారా యెదుర్కోవాలనీ, బెజవాడలో జరుగనున్న అఖిలభారత రైతుమహాసభను జయప్రదమొనర్చుటకై కృష్ణాజిల్లా రైతాంగంతోడ్పడాలని, హెచ్చరించారు.

కొత్తసంవత్సరానికి అనుమర్లపూడి శీతారామారావుగారు అధ్యక్షులుగాను, కాట్రగడ్డ రాజగోపాలరావుగారు ప్రధానకార్యదర్శిగాను, ఎన్నుకోబడ్డారు. రామినేని పిచ్చయ్య, జాలాది రామకోటయ్యగారలు సహాయ కార్యదర్శులు, కార్యనిర్వాహకవర్గానికి మరో 10 మంది సభ్యుల్ని ఎన్నుకున్నారు. అఖిలభారత రైతుమహాసభకు 60 మందిని డెలిగేట్లుగా ఎన్నుకున్నారు.

నెల్లూరుజిల్లా రైతుసంఘం

ఫిబ్రవరి 10, 11 తేదీలలో నెల్లూరుజిల్లా రైతుసంఘ జనరల్‌బాడీ నెల్లూరు టౌన్ హాలులో సమావేశమయింది. రెండురోజులూ వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. సాయంత్రం జరిగిన బహిరంగసభలకు 1000 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. జిల్లాసంఘ కార్యదర్శి బసవారెడ్డి శంకరయ్యగారు గత సంవత్సరంలో జరిగిన కృషిని వివరిస్తూ రిపోర్టు యిచ్చారు.

రాజకీయ ప్రతిష్టంభనను అంతమొందించుటకు రైతుసంఘాలు కాంగ్రెసునాయకుల విడుదలకు ఆందోళన చేయాలనీ; ధాన్యం ధరలూ - రైతు కవసరమైన వ్యవసాయ వస్తువుల ధరలూ కంట్రోలుచేయాలనీ: రైతులు తమధాన్యాన్ని ప్రభుత్వానికే అమ్మాలనీ తీర్మానించారు. నెల్లూరు టౌన్‌లోనూ, 10 వేల జనాభాకుమించిన పట్టణాలలోను రేషనింగును ప్రవేశపెట్టాలనీ; జమీందారీ ప్రాంతాలలో చెరువుల రిపేరుకు రైతులే పూనుకొని ఆ ఖర్చును శిస్తులనుండి ముజరా పెట్టుకోవాలనీ తీర్మానించారు. పెన్నఆనకట్ట లోని ఆండర్‌స్లూయిసుయొక్క ఫ్లడ్‌గేటును తెరచి, అక్కడి యిసుక దిబ్బలను తీయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

కొత్తసంవత్సరానికి దువ్వూరు బలరామిరెడ్డిగారు అధ్యక్షులుగాను, బసవారెడ్డి శంకరయ్యగారు ప్రధానకార్యదర్శిగాను, ఎన్నుకోబడ్డారు. సంయుక్తకార్యదర్శులు భీమవరపు శేషయ్య, వి. అప్పనాచార్యులుగారలు. వీరుగాక 6 గురు కార్యనిర్వాహకవర్గ సభ్యులు ఎన్నుకోబడ్డారు.

అఖిలభారత రైతుమహాసభకు 16 గురిని డెలిగేట్లుగా ఎన్నుకున్నారు.

కర్నూలుజిల్లా రైతుసంఘం

10-2-44 వ తేదీని కర్నూలుజిల్లా రైతుసంఘ జనరల్‌బాడీ సమావేశం కర్నూలులో శ్రీ. సి. పుల్లారెడ్డి అధ్యక్షతక్రింద జరిగింది. తుంగభద్ర, సంగమేశ్వరప్రాజెక్టులను నిర్మించుటకు ప్రభుత్వం వెంటనే పని ప్రారంభించి రాయలసీమను కరువునుండి కాపాడవలసిందని హెచ్చరిస్తూ తీర్మానం గావించారు.

కొత్తసంవత్సరానికి సి. పుల్లారెడ్డిగారిని అధ్యక్షులుగాను, వి. రామశాస్త్రిగారిని ప్రధాన కార్యదర్శిగాను, ఎన్నుకున్నారు. ఎల్. వెంకటప్పగారు ఉపాధ్యక్షులు, వి. సోమశేఖరరావుగారు సహాయకార్యదర్శి. అఖిలభారత రైతుమహాసభకు 10 మందిని డెలిగేట్లుగా ఎన్నుకున్నారు.

కడపజిల్లా రైతుసంఘం

ఫిబ్రవరి 14 వ తేదీని కడపజిల్లా రైతుసంఘ సాధారణసభ్యులు వై. ఈశ్వరరెడ్డిగారి అధ్యక్షతకింద సమావేశమై, కొత్తసంవత్సరానికి వై. ఈశ్వరరెడ్డిగారిని అధ్యక్షులుగాను, ఎన్. వరదారెడ్డిగారిని కార్యదర్శిగాను, ఎం. మాధవాచార్యగారిని సంయుక్తకార్యదర్శిగాను ఎన్నుకున్నారు. అఖిలభారత రైతుమహాసభకు ఈశ్వరరెడ్డి, వరదారెడ్డిగారలను డెలిగేట్లుగా యెన్నుకున్నారు.

గండికోట స్కీముకు ఎక్కువ ఆఫీసర్లను నియమించి పని త్వరగా సాగించాలనీ, వెల్లపాడు యేటికి ఆనకట్ట కట్టాలనీ, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ఆహారసమస్యా పరిష్కారానికి ప్రభుత్వం అదనపుధాన్యాన్ని కొని కొరత ప్రదేశాలలో చౌకడిపోలద్వారా అందజేయాలనీ; 500 వడ్లపుట్టి (మద్రాసు పడి) మంచిరకం వడ్లు రు. 85 చొప్పున, జొన్నలు రు 110 చొప్పున, సజ్జలు,రాగులు రు 100 చొప్పున, ధరలు కంట్రోలు చేయాలని కోరుతూ మరొక తీర్మానం గావించబడింది.

★ అజంజాహిమిల్లు కార్మికుల సమ్మె

కార్మికుల ఐక్యత యజమానుల కుతంత్రాలకు సమ్మెటపెట్టు

"వర్కింగు కమిటీలో హిందువులు, ముస్లింలు సగం సగం ఉండాలి" అజాంజాహి (ఒరంగల్లు) బట్టలమిల్లు కార్మికులు 1943 ఆగస్టులో తమ యూనియన్ ఎన్నికల విషయంలో కోరిన కోరిక ఇది. యూనియన్ ఏర్పడిన మొదటి రోజులవి.

మొన్న జనవరి 31 వ తేదీని తిరిగి ఎన్నికలు జరిగాయి. ఈ అయిదారు మాసాల్లో అజాంజాహి కార్మికులు, తమ సంఘం నాయకత్వాన విశేష అనుభవం సంపాదించారు. హిందువులయినా సరే, ముస్లింలయినాసరే, తామంతా కార్మికులమన్న విషయం వారిలో నాటుకుపోయింది. తమ వర్గాన్నెదుర్కొంటున్న కష్టాలు అందరికీ సరిసమానాలే అన్న సత్యాన్ని గుర్తించారు. జనవరి 30 వ తేదీన 4000 మంది హిందూ - ముస్లిం కార్మికులు ఏకముఖంగా యజమానుల నెదిరించి సమ్మె ప్రారంభించారు. తమ కష్టాలను నివృత్తిచేసుకొని అధికోత్పత్తి కొనసాగించడానికి కార్మికులు ఎన్నోవిధాల ప్రయత్నించారు. కాని యజమానులప్రవర్తనవల్ల కార్మికులకు వేరే మార్గం లేకపోయింది. జరిగిన ఎన్నికలలోకూడా మునుపటిలాగానే సగం సగం పద్ధతి అవలంబించా లనుకున్నారు సంఘనాయకులు. అది విని ముస్లింకార్మికులు లేచారు "ఆపద్ధతి అవసరంలేదు. ఆయా డిపార్టుమెంటుల్లోనుంచి, బాగా పనిచేసేవారిని అర్హతలనుబట్టి తీసుకోండి. హిందూ ముస్లిం విచక్షణ అనవసరం" అని చెప్పారు. ముస్లింల హక్కులను అంగీకరిస్తే హిందూ ముస్లిం ఐక్యత సాధ్యం కాదనేవారికి మరవరాని పాఠం నేర్పారు.

యజమానుల ఎత్తుగడలు

అజాంజాహి కార్మికసంఘ సేవనుగురించి ఇదిచెబితేచాలు. ఈసంఘ నాయకత్వాన,ఇంత చైతన్యం పొందిన కార్మికులు గతమాసం 30 వ తేదీనుంచి సమ్మె జరుపుతున్నారు.

సమ్మెవిషయంలో సంఘం క్రమపద్ధతిపై ఎంతో నిర్మాణయుక్తంగా పనిచేసింది. అజాంజాహి కార్మికులంతా 10 ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అన్నిప్రాంతాల్లోను వీధికమిటీలు ఏర్పరిచారు. మిల్లు చుట్టుపక్కల కావలా కాయడానికి వంతుప్రకారం ప్రతిప్రాంతం నుండి పంపడానికి ఏర్పాట్లు చేశారు. ఈకృషి అంతా చూచి సమ్మెవిషయంలో మధ్యస్థంగా ఉన్నవారుకూడా సంఘంవైపు మొగ్గారు. కార్మికుల్లో ఐక్యత పుత్సాహం పెంపొందింది.

తమపాలిటి సింహస్వప్నంగా ఉన్న ఈ కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నంచేసి, సమ్మెను భగ్నం చేయడానికి యజమానులు పన్నాగాలు ప్రారంభించారు. జాబర్లను యిందుకు ఉపయోగింప జూచాడా మేనేజింగు ఏజంటు. 'మాచేత కాదు'ని జాబర్లు తప్పుకున్నారు. మేనేజిమెంటువారి సి. ఐ. డి. లు రంగంలోకి దిగారు. సమ్మె పొడిగిస్తే 6 నెల్లపాటు మిల్లు మూసేస్తారు – బోనసంతా ప్రభుత్వం తీసుకుంటుంది – మీరు మలమల మాడి చస్తారని బెదరించారు కార్మికుల్ని. పాచికేమీ పారలేదు.

యూనియన్ వ్యతిరేకుల కుతంత్రాలను ఎప్పటి కప్పుడు బట్టబయలు చేస్తూ వలంటీర్లు ప్రచారం సాగించారు. సమ్మెకు కారణాలను వివరిస్తూ కరపత్రాన్ని వేసి 20,000 ప్రతులను ముఖ్యప్రదేశాల్లో పంచారు.

నాయకుల ఎదురెత్తులు

అంతేకాదు. సమ్మె ఎక్కువకాలం సాగితే కార్మికులకు కలిగే కష్టాల నెదుర్కోడానికి కూడా తగిన మార్గాల నాలోచించారు యూనియన్ నాయకులు. కార్మికులు స్వశక్తిపైని, పరస్పర సహకారంపైని ఆధారపడాలన్ననినాదాన్ని ప్రచారంచేశారు. ఉన్నడబ్బును, వస్తువులను అతిజాగ్రత్తగా వాడుకోవాలని బోధించారు. వీలయినంతవరకు ఏదో ఒక ఇతరపనిని చూచుకోవాలన్నారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చినవారు స్వగ్రామాలకు వెళ్ళిపోవాలన్నారు.

ఈ ప్రచారం ఫలితంగా చాలమంది కార్మికులు జంపఖానా ఫ్యాక్టరీలలో పనిచేయటం, చేపలుపట్టడం మొదలయినవాటిద్వారా కొంత సంపాదించసాగారు. మరొక ప్రయోజనం కూడా కలిగింది. కార్మికుల కష్టాలను యజమానులు ఉపయోగించుకోజూచారు. యజమానుల ఏజంటయిన ఒక జాబరు 70 మంది సమ్మెదారులను వెంటబెట్టుకొని వచ్చి యూనియన్ తనకు తిండి పెట్టాలని ఆందోళన చేయించాడు. యూనియన్ నాయకులు ఆ జాబరుయొక్క మోసాన్ని స్పష్టపరిచారు. కార్మికులు స్వశక్తిపై నాధారపడాలన్నారు. కార్మికులు నిజంతెలుసుకున్నారు. ఆనాటినుంచి యజమానుల ఈ ఎత్తుగడకూడా నిష్ప్రయోజనమయింది.

చివరకు మేనేజింగుఏజంటు తాను కార్మికులకు కలిగించిన లాభాలంటూ ఒక జాబితాను ప్రకటించాడు. యూనియన్ నాయకులు అనవసరంగా సమ్మె రెచ్చగొట్టారన్నాడు. ఈ కరపత్రం చదువుకొని కార్మికులు నవ్వుకున్నారు.

ప్రజల తోడ్పాటు

ఈ విధంగా యజమానుల కుతంత్రాలనన్నింటినీ యూనియన్ ఎప్పటికప్పుడు సమర్థతతో ఎదుర్కోవడం కార్మికులకు నూరింతలు బలం కలిగించింది. కార్మికులు క్రమశిక్షణతో శాంతంగా సమ్మె సాగించడం ప్రజల సానుభూతిని సంపాదించింది. స్థానిక న్యాయవాదులలో ముఖ్యులైన కాశోజీ నారాయణరావు, పర్చ రంగారావు, మాదిరాజురామకోటీశ్వరరావు,మద్దిరాజు రాజేశ్వరరావుగార్లూ, ముస్లింప్రముఖులైన అబ్దుల్ అలీమ్‌సాహెబ్, తఫజుల్ హుస్సేన్‌సాహెబ్‌గార్లూ కలిసి కార్మికుల కోర్కెలను బలపరుస్తూ, వారికి ధనధాన్యాదులు విరాళాలిచ్చి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ ఒక ప్రకటన చేశారు. స్టేటు కాంగ్రెసు నాయకులైన స్వామి రామానందతీర్థకూడా ఆ ప్రకటనపై సంతకం చేశారు. వరంగల్లులోని ఇత్తిహాదుల్ ముస్లిమీన్ నాయకులందరూ కార్మికులను పూర్తిగా బలపరుస్తున్నారు. ఈ సంస్థ నాయకుడయిన యార్‌జంగ్ బహదూర్ కార్మికుల కోర్కెలను గురించి ప్రభుత్వంతో సంప్రదింపులు కూడా జరిపారు.

వెంకటాపురం గ్రామస్థులు రు. 24 లు, రాయన్నపేట గ్రామస్థులు రూ. 41 లు, చిర్నోములలో రూ. 25 లు, సిరిపురంలో రూ. 30 లు కార్మికుల సహాయార్థం విరాళాలిచ్చారు. తిరుపూరు తాలూకా తునికిపాడులో రూ. 41 లు వసూలయింది. ఇంకా వాగ్దానాలు కొన్ని ఉన్నాయి.

ఈ విధంగా చెక్కుచెదరని ఐకమత్యంతోను, ప్రజల సహకారబలంతోను నిల్చున్న కార్మికులు తమకోర్కెలను తప్పక సాధించుకుంటారు.

(1వ పేజీ తరువాయి)(ఇందులో 4 గురువిద్యార్థినిలు) ప్రతినిధులు బాగా చర్చించి, అంగీకరించారు. ఒక్కొక తీర్మానం పైని తమ అనుభవాన్ని జోడించుతూ చక్కగా ఉపన్యసించారు. ఉదాహరణకు కొన్ని తీర్మానాలను తీసుకొందాం. ఉపాధ్యాయులకు - విద్యార్థులకు మధ్య సహకారం ఉండాలి: ఈ తీర్మానంపై ఇలా మాట్లాడారు : ఎవ్వరో పెద్ద ఉపాధ్యాయులకు తప్ప చిన్నవారికి జీతాలు చాలడంలేదు. అందుచేవారు ప్రయివేటు చెప్పుకొంటూ విద్యార్థులకు తగినంత శ్రద్ధ చూపడంలేదు. అలాంటి ఉపాధ్యాయులకు హెచ్చుజీతాలీయాలని విద్యార్థు లాందోళన చెయ్యాలి. ఇలాఆందోళన చేసినచోట, విద్యార్థులను డిస్మిస్ చేయకుండా ఉపాధ్యాయులు ఎలా సహకారం చేశారో కొన్ని ఉదాహరణలను తీర్మానం ప్రతిపాదించిన విద్యార్థి తెలియజేశాడు.

బాగా చదవాలి అన్న తీర్మాం: విద్యార్థి ఉద్యమంలో పనిచేయడం అంటే చదువు ఎగగొట్టడంఅనే దురభిప్రాయం వుంది. కాని విద్యార్థివర్కర్లే బాగాచదివి,ఎక్కువమార్కులు సంపాదించడంవల్ల ఉపాధ్యాయుల, తలిదండ్రుల సహకారం ఎలాలభించుతోందో తీర్మానంతెచ్చినవారు తెలియజేశారు. కొన్నిచోట్ల సీధికమిటీలు, హాస్టల్‌కమిటీలు పెట్టి విద్యార్థులు బాగా చదువుతున్నదీ, లేనిదీ అజమాయిషీ చూస్తున్నారు. మరికొన్నిచోట్ల వెనుకబడ్డవిద్యార్థులకు తామేట్యూషన్ చెబుతున్నారు. ఇలా కృష్ణా, గుంటూరు జిల్లాలలో కొన్నిచోట్ల జరుగుతున్నదని ఉదాహరణలనిస్తూ నర్సయ్యగారు మాట్లాడారు.

కో-ఎడ్యుకేషన్‌ను నిరసించకపోయినా, నేటి సమాజపరిస్థితులలో స్త్రీ విద్యార్థినులు ఆటపాటలలో గాని, ఇతర విషయాలలో గాని చొరవతో ముందుకు రావడానికి, ఈ కాలేజీలలో అవకాశం లభించడంలేదు. అందుచే ప్రత్యేక కళాశాలలు అవసరం అంటూ, హేమలత, కోటేశ్వరమ్మగారలు మాట్లాడారు.

బహిరంగసభ

ఈవిధంగా 13 వతేదీ ఉదయానికి విషయనిర్ణయసభ జయప్రదంగా జరిగింది. సాయంత్రం బహిరంగసభకు 1200 మందివచ్చారు. కామ్రేడ్ తమ్మారెడ్డి, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ సాధించిన విజయాలు, ప్రస్తుత క్షామపరిస్థితులను గురించి మాట్లాడారు. కామ్రేడ్ బసవపున్నయ్య ప్రస్తుత ప్రతిష్ఠంభనను భగ్నంచేయడానికి, ఆహారసమస్యా పరిష్కారానికి, జాతీయైక్యత ఒక్కటే ఎలా సాధనమో, గంటన్నరసేపు విపులంగా ఉపన్యసించారు.

విచ్ఛిన్నకుల ప్రయత్నం

మొత్తంమీద విద్యార్థిమహాసభ జయప్రదంగా జరిగింది. కాని విచ్ఛిన్నకులు తమ ప్రయత్నాలను మానలేదు సాయంత్రం బహిరంగసభ జరుగుతోంది. కామ్రేడ్ బసవపున్నయ్య గంభీరోపన్యాసానికి చీమకూడా చిటుక్కుమనడంలేదు. రాష్ట్రీయ స్వయంసేవకసంఘం గుట్టు బయటపెట్టేసరికి, ఒకాయనకు రోషంవచ్చింది. ఆయన స్థానం పార్థసారథిగారట. ఆయన బయటకు పోయి హంగామాచేశాడు. బయట ఏమిటో జరుగుతోందని కొందరులేచారు. కాని వలంటీర్లు సర్దారు. ఆయన కొన్నిప్రశ్నలు పంపాడు. ఆ ప్రశ్నలను చదువుకొని, తన ఉపన్యాసంలోనే సమాధానం ఇచ్చాడు కామ్రేడ్ బసవపున్నయ్య ఉపన్యాసం పూర్తికాగానే, తిరిగీ జవాబు చెప్పాలంటూ ఆర్. యస్. యస్. తరపున పార్థసారథి కోరాడు. "మీ ప్రశ్నలకుజవాబు ఇదివరకే నాఉపన్యాసంలో ఇచ్చాను. కొత్తప్రశ్నలుంటే వేయండి." అని బసవపున్నయ్యగారు అడిగారు. సమాధానాలు వినడానికి వచ్చినవారైతేగా! ఏదో మిషతో అల్లరిచేయాలని వచ్చారు వాళ్ళంతా. ఒక్కసారిగాలేచారు. భావనాచారి అనేఅతను చెప్పులు విసిరాడు. మరొకడు రాయివిసిరాడు.వలంటీరుగా పనిచేస్తున్న రైతువర్కరు మొవ్వా అంకమ్మగారు భావనాచారిని పట్టుకొని, ఇంకా ఏదో తిరుగుతూంటే నాల్గు పోట్లుపొడిచి,ప్లాట్‌ఫారం దగ్గరున్న పెద్దమనుష్యులవద్దకుతీసుకువచ్చాడు. జాతీయవిద్యార్థుల పేరిట అల్లరిచేసే రౌడీలూ, రాష్ట్రీయ స్వయంసేవకములా, బయటికి లేచిపోయారు. తర్వాత జిల్లావిద్యార్థి ఆఫీసుపైకి, కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుపైకి,వెళ్ళి రాళ్ళువేశారు. అక్కడ ఉన్న వలంటీర్లు వాళ్ళకు బుద్ధిచెప్పిపంపారు.

సభలో అల్లరి సద్దుమణిగినతర్వాత వైజ్ఞానిక కార్యక్రమం ప్రారంభమయింది. అలాంటి సమయంలో ఈ ఆఫీసులపై దాడిని గురించినవార్త వచ్చింది. తమ్మారెడ్డి, ఆవేశపూరితంగా, ఈ రౌడీ చర్యలను వెల్లడించి వీటిని ప్రతిజాతీయవాదీ ఖండించాలనికోరాడు.

ఒక విషాదఘటన

ఇంతలో బెండపూడి నారాయణరావుగారనే స్థానికన్యాయవాది-"మీసభలలో మీరువాళ్ళను ఇలా తిడతారు, వాళ్ళ సభలలో వాళ్లు మిమ్మల్ని ఇలాగే తిడతారులేవయ్యా," అంటూ హేళనగా మాట్లాడారు. దానికి బసవపున్నయ్యగారులేచి, నారాయణరావుగారివంటి పెద్దలు, రౌడీలను, సక్రమంగా సభ జరుపుకొనే విద్యార్థులనూ ఒకేరకంగా జతగట్టడం పెద్దమనిషి తరహాకాదని మందలించారు. అంతటితో నారాయణరావుగారూ, వారితోపాటు వచ్చిన వారి మిత్రులూ లేచివెళ్ళిపోయారు. మొదటినుండీ అల్లరిచేసేవారిని ఖండించకపోగా, నారాయణరావుగారి వైఖరి వింతగావుంది. చెప్పులువేసిన వ్యక్తిని తీసుకువచ్చి చూపించితే, "మీరబద్ధమాడుతున్నా"రని బసవపున్నయ్యగారిని ఆయన దబాయించారు. రెడ్‌ఆర్మీని గురించి కోలాటం పాటలను విద్యార్థులు పాడుతుంటే, "రష్యా మానసపుత్రులు" అంటూ హేళనచేయసాగారు. ఇలా రౌడీలచర్యలను ఖండించకపోగా, విద్యార్థులను హేళనచేస్తూ మాట్లాడటం, తటస్థవైఖరి అనిపించుకోదు. రౌడీల అల్లరిమూలంగా ఇదివరకు ఊరేగింపులు నిషేధించబడ్డాయి. ఇక మీటింగులకుకూడా ప్రాప్తిలేకండా చేయడానికే, ఇలా మీటింగులను భగ్నంచేయాలని దుండగీడులు ప్రయత్నిస్తున్నారు.నారాయణరావుగారివంటి పెద్దలు రౌడీలచర్యలనుచూస్తూ సహించడమే వారికి పరోక్షంగా సాయం చేయడమవుతుంది.

ఆనాటితోనే అల్లర్లు ఆగలేదు. మరునాడు కూడా ఒంటరిగా విద్యార్థులను కొట్టడం, తిట్టడం, సాగించుతున్నారు. ఇంతమాత్రానికి, విద్యార్థులు భయపడరు. బెదరింపులకు,కొట్లాటలకు లొంగి విద్యార్థి ఉద్యమం ఆగిపోదు.

14 వ తేదీ రాత్రి, ఈ పైఘటనలు ముగిశాక, వైజ్ఞానిక కార్యక్రమం జయప్రదంగా జరిగింది. బెంగాల్‌క్షామంపై పెదనందిపాడు విద్యార్థి తాను వ్రాసిన గీతాన్ని బిచ్చగాని వేషంతో పాడాడు. ప్రేక్షకుల మనస్సు లుర్రూత లూగించాడు. అప్పటికప్పుడు రు. 6-8-0 వసూలయింది. అది బెంగాల్ విద్యార్థి సంఘానికి పంపబడుతుంది. విచ్ఛిన్నకులెంత ప్రయత్నించినా, ఎంత హడావిడి చేసినా, వచ్చిన 1200 మంది స్త్రీ పురుష ప్రేక్షకులు తదేకదీక్షగా కూర్చుని విద్యార్థి మహాసభను జయప్రదం గావించారు.

★ యుద్ధసమీక్ష

90 వేల నాజీలకు సమాధి

26 ఏళ్లక్రితం. సోవియట్ రాజ్యం ఏర్పడిన కొత్తరోజులవి. శైశవావస్థలో తొట్రుపడుతూన్న ఆ రైతు, కూలీరాజ్యంపై ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులన్నీ తమ కరకుకత్తులను దూశాయి. ప్రపంచ ప్రజాసామాన్యానికి స్వాతంత్ర్య సౌఖ్యాభివృద్ధుల ఆశాజ్యోతిని రగిల్చింది సోవియట్ రాజ్యం. దాస్యశృంఖలాలనుండి విముక్తి పొందిన రష్యన్ రైతు కూలీ ప్రజలందరూ, ఆజ్యోతిని కాపాడడానికి రణరంగంలో ఉరికారు. ఆదేవీర రెడార్మీ పుట్టుక. ఏకాకిగా నిలచి రెడార్మీ ఆనాడు ప్రపంచసామ్రాజ్య వాదశక్తులనన్నిటిని ఎదిరించింది. విజయం సాధించింది. ఆనాడు రెడార్మీ ఓడించిన సేనల్లో ఒకటి జర్మన్ సేన. ఆ సేనకు తగిలిన చావుదెబ్బల్లో కొన్ని నార్వా, ప్స్కోవ్‌రంగాల్లో తగిలాయి.

ఈ నాడు

రేపు 23 వ తేదీ - రెడార్మీయొక్క 26 వ పుట్టుకదినం. నార్వా, ప్స్కోవ్ రంగాల్లో మరొకసారి రెడార్మీ బారులుతీరి ముందుకు సాగుతూంది. జర్మన్ మూకలు మరొకసారి చావుదెబ్బలుతిని వెనక్కు దొర్లుకు పోతున్నాయి. "శత్రుమూకల్ని విధివిరామంలేకుండా తరిమికొట్టండి. రాత్రనక,పవలనక శత్రువును హతమార్చండి. ఊపిరితీసుకోవడానికయినా వ్యవధినివ్వకుండా నాశనంచేయండి." అని కామ్రేడ్ స్టాలిన్ ఇచ్చిన సమర సందేశాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూంది రెడార్మీ. ప్రపంచ ప్రజలకు స్వాతంత్ర్య సౌఖ్యాభివృద్ధుల అవకాశాన్ని మరోసారి ప్రసాదిస్తూంది రెడార్మీ.

★

సోవియట్ ఉత్తరరంగంలో ఒక ప్రధాన జర్మన్‌దుర్గం స్టారాయారుసా. ఇక్కడనుంచి పడమటిదిక్కుగా ప్స్కోవ్‌కి ఒకరైలుమార్గం ఉంది. ఈ రైలుమార్గానికి ఉత్తరంగా 30 మైళ్లదూరంలో షిమ్‌స్కు నగరంనుంచి ప్స్కోవ్‌కి పోయేరోడ్డు ఉంది. స్టారాయారుస్సా, షిమ్‌స్కు నగరాలు రెడార్మీ వశమయ్యాయి. స్టారాయారుస్సాలోని జర్మన్‌సేనలు ప్స్కోవ్ వైపు పారిపోడానికి ప్రయత్నిస్తున్నాయి. రెడార్మీ దళాలు వీటిని వెన్నంటి తరుముతున్నాయి. అటు లుగానుండి మరికొన్ని రెడార్మీదళాలు స్టారాయారుస్సా – ప్స్కోవ్ రైలుమార్గంమీదికి ఉరకలుతీసుకొస్తున్నాయి. ఈ రైలుమార్గం నడిమధ్యనున్న డ్నో అనే జంక్షన్‌కి రెండువైపుల రెడార్మీదళాలు చాల దగ్గరకువచ్చేశాయి. పారిపోతున్న జర్మన్ మూకలకిది కత్తెరబోను.

ప్స్కోవ్‌మీదికి

ఈలోగా లుగానుంచి అటు ప్స్కోవ్‌మీదికి రెడార్మీ పురోగమనం నిరాఘాటంగా సాగుతూంది. పారిపోతున్న జర్మన్‌మూకల్లోకి రెడార్మీదళాలు జొరబడి, జట్టులు జట్టులుగా చీలదీసి హతమార్చేస్తున్నాయి. పెద్దపెద్ద సోవియట్ గెరిల్లాదళాలు బయటికి వచ్చి, జర్మన్లు పెట్టిపోతున్న మందుపాతరలను తీసివేస్తూ రెడార్మీకి ఆటంకాలను తొలగిస్తున్నాయి. లుగా, ప్స్కోవ్ రైలుబాటమీద ఎటుచూచినా ఈ గెరిల్లాదళాలు, పేలగొట్టిన జర్మన్‌రైళ్ళు తునాతునకలుగా పడున్నాయి. అక్కడ నాజీనరహంతకులకు అన్నివైపులా కార్చిచ్చులు కమ్ముకొస్తున్నట్లు ది. దీనికితోడు సోవియట్ విమానదళాలు ప్స్కోవ్‌ను మర్దించడం ప్రారంభించాయి. ఈ రగంలోని జర్మన్లు తప్పించుకుపోడానికి ఈ దారితప్ప మరొకమార్గంలేదు. అంతేకాకుండా ప్స్కోవ్ రెడార్మీ వశమయినట్లయితే ఎస్తోనియారాష్ట్రంలోవున్న నాజీసేనలకు ప్రమాదంసమీపిస్తుంది. ఇంత ముఖ్యమైన ఈ నగరాన్ని దక్కించుకోడానికి జర్మన్లు అదనంగా సేనల్ని తెప్పిస్తున్నారట. కాని, రెడార్మీ పురోగమనాన్ని ఆపగలశక్తి ఇక జర్మన్ల కున్నదా?

అమోఘ విజయాలు

ఉత్తరాన నాజీ వ్యూహాన్నియిలాచీల్చి చెండాడుతూంది వీరరెడార్మీ. ఆ సీనమయంలో దక్షిణాన రెడార్మీ సేనలు 90 వేల మంది నాజీలకు సమాధికట్టాయి. చెర్కాసీ ప్రాంతంలో రెడార్మీ ఉక్కువలయంలో చిక్కున్న పది నాజీ డివిజన్లు ఈవారంలో పూర్తిగా ధ్వంసమయాయి. ఈ వలయంలో మొత్తం 55000 మంది జర్మన్లు చచ్చారు. 18200 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. వందలకొలది టాంకులు, విమానాలు, ఫిరంగులు - యితర యుద్ధసామగ్రి సోవియట్‌దళాలకు చిక్కింది. రెడార్మీ వ్యూహాన్ని భేదించి, ఈ జర్మన్లను దక్కించుకోడానికి బయటనుంచి ఫాన్‌మాన్‌స్టీన్ ఎంతో ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాలన్నీ విఫలమయిపోయాయి. పైగా ఖిలాప్రయత్నించిన జర్మన్‌సేనల్లో మరో 20 వేల మంది చచ్చారు.

ఈపని పూర్తిచేసిన రెడార్మీ సేన లింకొకకొత్త కార్యక్రమాన్ని తీసుకోనున్నాయి. పడమటి ఉక్రేన్‌లో ఇంకా మిగిలిఉన్న జర్మన్ మూకలపై రెడార్మీ ఉప్పెన విరుచుకుపడనుంది.

సామ్రాజ్యవాదుల ఆరాటం

పరంపరలుగ రెడార్మీ విజయాలు సాధిస్తూంది. రెడార్మీవిజయాలు యూరప్‌అంతటా ప్రజల స్వాతంత్ర్య ఉద్యమాలను నానాటికి పైస్థాయికి తీసుకుపోతున్నాయి. దీనితోపాటు సామ్రాజ్యవాద, అభివృద్ధినిరోధకుల ఆరాటం అతిశయించుతూంది. మునుపటి పెత్తనాన్ని ఏవిధంగానైనా నిలబెట్టుకోవాలని, ప్రజలపై సవారీని ఇంకా సాగించాలని వీరి కలలు.

తాపీ మోహన్‌రావ్

లండన్‌లోని పోలిష్ ప్రభుత్వం నిన్న మొన్నటివరకు సోవియట్‌పై విషప్రచారం సాగిస్తూ వచ్చింది. ప్రవదా పత్రిక ఈ ప్రభుత్వాన్ని గురించి ఇలావ్రాసింది :

"ఈ ప్రభుత్వంలో ఫాసిస్టు లున్నారు. నాజీలు కల్పించిన కలల్లో ఈప్రభుత్వం తేలుతూంది. ఈ పోలిష్ సామ్రాజ్యవాదులు సోవియట్ ప్రజల్ని తమ గర్భశత్రువులుగా చూస్తున్నారు. పైకి మాత్రం జర్మన్లపై పగ ఉన్నట్లు నటిస్తున్నారు." ఈ ప్రభుత్వం ఆధ్వర్యాన పోలండులో ప్రచురింపబడుతూన్న రహస్యపత్రికల్లోని కొన్ని విషయాలనుకూడ ప్రవదా ప్రకటించింది. రష్యన్లను, కమ్యూనిస్టులను ఎదుర్కొమని ఈ పత్రికలు పోలండు ప్రజల్ని రెచ్చగొడు తున్నాయి. జర్మన్ల తరఫున ఈ ప్రభుత్వం పోలండులో గూఢచారి సంస్థను నడుపుతూందని ప్రవదా నిదర్శనపూర్వకంగా ప్రకటించింది.

ఈ కుట్రలకు పోలండు ప్రజలు చెబుతూన్న జవాబేమిటి? పోలండులోని జర్మన్ పోలీసునాయకునిని చంపారు. అందుకు ప్రతిక్రియగ జర్మన్లు సాగించిన రాక్షసచర్యలను వలించకుండా ఎదుర్కొన్నారు. ఎక్కడ వీలయితే అక్కడ వేలకొలదిగవచ్చి రెడార్మీ పక్షంచేరి, పోలండు స్వాతంత్ర్య సేనలో తరిఫీదు పొందడానికి ముందుకు వస్తున్నారు.

ఇక ఫిన్లండు విషయం. హెల్సింకి (ఫిన్లండు రాజధాని) మీద సోవియట్ విమానాలు తీస్తున్నదెబ్బలు జర్మను తొత్తుగా పనిచేసే ఫిన్లండుకు బుద్ధి చెబుతున్నాయి. సోవియట్‌తో సంధికోసం ఫిన్లండు ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి హెచ్చుతూంది. ఒకప్పుడు ఫిన్లండు ప్రధాన మంత్రిగాఉండిన పాసికివి సంధిసంభాషణలకై స్వీడన్ రాజధానికి వెళ్ళినట్లు వదంతులున్నాయి.

ఇటలీలో ఇమాన్యుయల్‌రాజు ప్రజాస్వామిక రంగులు కొన్ని పూసుకొని, ఇంకా ఉట్టికట్టుకొని ఊగులాడాలనుకొంటున్నాడు. కాని, ఇటలీప్రజలు లోగడ చరిత్రను మరచిపోలేదు. ప్రజాప్రభుత్వంకోసం ఆందోళన ఏమాత్రం సన్నగిలలేదు.

ఈవిధంగా ఫాసిజానికి వంతపాడిన ప్రతి ప్రభుత్వం—ఫిన్లండు, పోలండు, హంగరీ, రుమేనియా, యుగోస్లావియా, ఇటలీ, స్పెయిన్—అన్నీ ఫాసిస్టువ్యతిరేక ప్రజావుద్యమాల తీర్పుకి గురికానున్నాయి సోవియట్ విజయాల ఫలితంగా ఈతీర్పు దినం సమీపిస్తూంది. 21—2—44.

మనరాజకీయాలు

(2 వ పేజీ తరువాయి) ప్రభుత్వంచేసిన సహాయంఏమిటి? అధికధరల అలవెన్సు విషయంలో రైల్వే మెన్స్‌ఫెడరేషన్‌కోరిన కోర్కెను కాలదన్నింది. ధరల పెరుగుదల ననుసరించి అలవెన్సు పెంచలేదు. దేశానికంతకూ 521 చౌకడిపోలుమాత్రం తెరువబడినట్లు ప్రభుత్వసభ్యుడు తెలియజేశాడు. షుమారు 8 లక్షలమంది రైల్వేకార్మికులకు 521 డిపోలు ఏమూల కొస్తాయి?

రైల్వేకార్మికుల్ని అతడిలా హెచ్చరిస్తున్నాడు : "రైళ్ళను మీరు యిప్పటికంటే ఎక్కువజోరుగా నడపవలసియుంది. ఎందువల్లనంటే, ఇండియా ప్రధానమైన యుద్ధరంగం కాబోతూంది. పరిశ్రమలన్నీ జోరుగా నడవాలి. ప్రజలకు కావలసిన సరుకులన్నీ చురుకుగా రవాణాచేయబడాలి .... ఇందులో చాలా శ్రమ ఉన్నమాటనిజమే. కాని మీరు మీకర్తవ్యాన్ని నెరవేర్చి, ఖ్యాతి సంపాదిస్తారని నావిశ్వాసం."

దేశంయొక్క ఆర్థిక నిర్మాణంలో యింత ప్రాధాన్యత వహించిన రైల్వేకార్మికులపట్ల ఇండియా ప్రభుత్వం మొదటినుంచీ "నీకంట్లో నేను వేలుపెడతా; నా నోట్లోనువ్వు వేలుపెట్టు!" అనే నీతినే అవలంబిస్తూంది.

బొగ్గుసమస్య

అన్నింటికంటె ముఖ్యమైనది బొగ్గుసమస్య. 1943-44 సంవత్సరంలో రైల్వేలకు సప్లయి అయినంత తక్కువబొగ్గు యిదివరకెన్నడూ కాలేదు" అని బెంథాల్ తెలియచేశాడు. కౌన్సిల్ అఫ్ స్టేట్‌లో సర్ లియొనార్డ్‌విల్సన్ రైల్వేబడ్జటును ప్రవేశపెడుతూ, రైళ్లకు కావలసిన మొత్తం బొగ్గులో 100 కి 35 వవంతు మాత్రమే లభించినదనీ, అందువల్ల యితర పరిశ్రమలకూ, సంస్థలకూ తగినంత బొగ్గుసప్లయికావడం లేదనీ, తెలియజేశాడు.

దేశంలో బొగ్గు ఉత్పత్తి యింత పడిపోవడానికి కారణంయేమిటి? కార్మికులుతక్కువ కావడంవల్ల స్త్రీలచేతకూడా గనులలో పని చేయించుతున్నాం అని ఢిల్లీలోను, లండన్‌లోను, అధికారవర్గంవారుసాకుచెబుతున్నారు. కాని, అసలు కారణం యిది కానేకాదు. కార్మికులకిచ్చే తక్కువ జీతాలే అసలు కారణం అని చెప్పాలి. ఝరియా (బీహార్) బొగ్గుగనులలో నెలకు రు. 14, 15 లకంటె యెక్కువ జీతం ఇవ్వడంలేదు. నైజాం బొగ్గుగనులలో (కొత్తగూడెం) కార్మికులకిచ్చే సగటు జీతం నెలకు పదిపన్నెండు రూపాయలు! ఇంతతక్కువ జీతాలతో కార్మికులు పొట్టపోసుకోలేక, వెళ్లిపోతున్నారంటే ఆశ్చర్యం ఏముంది?

బొగ్గుగనులు చాలవరకు యూరపియన్ యజమానులవి. వారు ఉత్పత్తినైనా కుంటుబరుస్తారుగాని, కార్మికులకు జీతాలెక్కువ చేయరు. కేంద్రశాసనసభలో యూరపియన్ సభ్యుడు రిచర్డ్‌సన్ యిలా ఉపన్యసించాడు: "బొగ్గును ఎక్కువగా ఉత్పత్తిచేయడం వల్ల యజమానులకు గిట్టుబాటుకాదు. ఎందువల్లనంటే, వారి జమలు తరిగి పోతున్నాయి. ఎక్కువ ఉత్పత్తివల్ల యెక్కువ లాభాలొచ్చినప్పటికీ,అవిఅధికలాభాలపన్ను కుపోతాయి."

యజమానులకు ప్రభుత్వ సహాయం

కాబట్టి యూరపియన్ యజమానులకు లాభాలు తగ్గకుండా ఉండేటందుకు, స్త్రీలకు తక్కువ జీతాలిచ్చి గనులలో పనిచేయిస్తున్నారు. ప్రభుత్వం యిందు కంగీకరించింది. 1939 నాటి రేట్లుకంటె 100 కి 50 రూపాయలచొప్పున జీతాలు హెచ్చించడానికి యీమధ్య ప్రభుత్వం నిశ్చయించినట్లు తెలుస్తోంది. కాని, అప్పటికీ ఇప్పటికీ, జీవితావసరాల ధరలు 3, 4 రెట్లు హెచ్చాయి. ఈ పెరుగుదలతో సమానమైన యుద్ధఅలవెన్సు యివ్వకపోగా, అదనంగా ఉత్పత్తిఅయే బొగ్గుమీద అదనపులాభాలపన్ను రద్దుచేయబడింది! దీని అర్థం, యూరపియన్ యజమానులకు ప్రభుత్వం చక్కని సదుపాయం చేసిపెట్టిందన్నమాట. బొగ్గుసమస్యను పరిష్కరించి రైల్వేలను, పరిశ్రమలను, జోరుగా నడపాలంటే, ప్రభుత్వం తనవైఖరిని పూర్తిగామార్చుకొని, ట్రేడ్‌యూనియన్‌లతో సంప్రదింపులు ప్రారంభించాలి. స్త్రీ కార్మికుల్ని గనులలో పనిచేయించకూడదు. పురుషకార్మికులకు ధరల పెరుగుదలనుబట్టి యుద్ధఅలవెన్సు యివ్వాలి.

గమనిక

వచ్చేవారంనుంచి 'ప్రజాశక్తి' రాయల్ సైజులో 12 పేజీలతో వెలువడుతుంది. వెలలో మార్పులేదు.

మేనేజరు.

అరెస్టులు- నిర్బంధాలు

నవంబరు మొదటితేదీని దెందులూరులో ఏలూరుతాలూకా యువజనమహాసభజరిగింది. ఆ మహాసభలో పాల్గొన్న కామ్రేడ్ కంఠంపాటి సత్యనారాయణ (జూనియర్: కమ్యూనిస్టుపార్టీ రాష్ట్రఆర్గనైజరు), గారపాటియుగంధర్ (ప. గో. జిల్లా యువజనసంఘ అధ్యక్షుడు), మరిముగ్గురుపైన, కాంగ్రెసుపాలసీని సమర్థిస్తూ ఊరేగింపులు, మీటింగులు జరిపారని కేసు పెట్టారు. ఈనెల 15 వ తేదీని ఈ ఐదుగురికి చెరి ఆరేసిమాసాలు శిక్ష విధించబడింది.

★

వరంగల్లులోని అజంజాహి మిల్లు కార్మికసంఘంపై నైజాంప్రభుత్వం దాడిప్రారంభించింది. ఆ సంఘఅధ్యక్షుడైన సమద్‌రజవీ (బి.ఏ.,యల్.యల్.బి.) గారిని, కార్యదర్శి యన్.రామనాథంగారిని, ఆర్గనైజరు సయ్యద్ ఇబ్రహీంగారిని ½ గంటలో వరంగల్ జిల్లాను విడిచిపోవలసిందని 14వ తేదీరాత్రి ప్రభుత్వం ఉత్తరువుచేసింది. కార్మికులను పనిలోనికి పోనివ్వటంలేదని నేరంమోపి సయ్యద్‌ఖుంద్‌మీర్‌గారిని (సంఘకార్యనిర్వాహకసభ్యుడు), కార్మికుల కోరికలపై సుబేదారుదగ్గరకు డెప్యుటేషన్ తీసుకువెళ్ళినందుకు మల్లేశం (కార్యనిర్వాహకసభ్యుడు)గారిని 18వ తేదీని అరెస్టుచేశారు.

★

కామ్రేడ్ కొటాగిపులపల్లి సుబ్బారావు (పాలకొల్లు) ఇంట్లో ఏవోనిషిద్ధ కరపత్రాలున్నాయని పోలీసులు గతసంవత్సరం ఆగస్టు నెలలో అరెస్టుచేసి, విచారణకు పెట్టగా కొవ్వూరు సబ్‌డివిజనల్‌మేజిస్ట్రేటు 25-1-44 తేదీని 9 నెలలు కఠిన శిక్ష విధించాడు. 16-2-44 తేదీని కామ్రేడ్ సుబ్బారావు జామీనుపై విడుదల చేయబడ్డాడు.

విద్యార్థి జీవితానికి విద్యార్థిసంఘం చుక్కాని

"మీరేదో అల్లరి పిల్లకాయలనుకునే వాళ్ళం. కాని మీ కార్యదీక్షను చూస్తుంటే మా అభిప్రాయం మార్చుకొనక తప్పడంలేదు. నిజమైన దేశసేవకుల్లాగా పనిచేస్తున్నారు" - విజయనగరం, గన్నవరం, గుడివాడ, నెల్లూరు, సూళ్లూరుపేట, మొదలైన ప్రదేశాల్లో విద్యార్థిసంఘ సభ్యులు ఉపాధ్యాయుల నుండి పొందిన మన్ననలివి. బెంగాల్ క్షామ నివారణకు ఈ విద్యార్థులు జరిపిన కృషిని ఉపాధ్యాయులు ఈ మాటలతో ఆశీర్వదించారు. గత మూడుమాసాల్లో నాలుగువేల రూపాయలు వసూలుచేసి క్షామనివారణ నిధికి పంపారు. వెయ్యిగుడ్డలను పంపారు. త్రైవానా కొని పంపారు. ఈ కృషి ఉపాధ్యాయులకు కూడ ఉత్సాహంకలిగించింది. "విద్యార్థి ఉపాధ్యాయ ఐక్యకమిటీ"లను ఏర్పాటుచేయడానికి ఉపాధ్యాయులే ముందుకొస్తున్నారు.

వ్యక్తి జీవితంలో

దేశాన్నెదుర్కొంటున్న ముఖ్య సమస్యల విషయంలో విద్యార్థిసంఘ నాయకత్వంకింద విద్యార్థులు నేడు నిర్వహిస్తున్న పాత్రకిదొక నిదర్శనం.

జాతి జీవితంలో విద్యార్థి తన పాత్రను జయప్రదంగా నిర్వహించాలంటే విద్యార్థి తన జీవితాన్ని క్రమశిక్షణతో, ఆదర్శవంతంగా నడుపుకోవాలి. తమ సభ్యులనందరిని ఆదర్శ విద్యార్థులుగా అభివృద్ధి చేయడానికి విద్యార్థి సంఘాలు కృషిచేస్తున్నాయి. విద్యార్థి సంఘ సభ్యులందరూ బాగా చదివి, మంచి మార్కులతో ప్యాసయేలా ప్రోత్సహిస్తుంది. చల్లపల్లి (కృష్ణాజిల్లా) లో లాడ్జి కమిటీలు పెట్టి ఈ కృషి కొనసాగిస్తున్నారు. ఉరవకొండ (అనంతపురం జిల్లా) లో విద్యార్థి సంఘం క్లాసు పుస్తకాల లైబ్రరీ ఒకటి పెట్టింది. పుస్తకాలు కొనుక్కోలేని బీద విద్యార్థులకిదొక పెన్నిధానంగా ఉంది. రోజూ 40, 50 మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి శ్రద్ధగా చదువుకుంటారు. చల్లపల్లి, గన్నవరం (కృష్ణా) కొల్లూరు (గుంటూరు) లో కూడా ఈ విధంగా జరుగుతూంది.

క్లాసు పాఠాలపై శ్రద్ధను అభివృద్ధి చేయడమే కాకుండా, ప్రపంచ పరిస్థితులనుకూడా విద్యార్థులకు ఈ సంఘాలు వివరిస్తున్నాయి. పామర్రు, తురిమెళ్ల మొదలైన చోట్ల వ్రాత పత్రికలను నడుపుతున్నాయి. పామర్రు సంఘం తన పత్రికఅయిన 'క్రాంతి' యొక్క జన్మదినం ఈమధ్యజరిపింది. విద్యార్థులంతా పండగ రోజు లాగా, కొత్త దుస్తులతో మీటింగుకువచ్చారు. ఆవేళబడికి రెండు పీరియడులు సెలవు ఇచ్చారు మాష్టర్లు.

విద్యార్థి సమస్యలపై

ఈ విధంగా విద్యార్థి జీవితాన్ని అభివృద్ధి చేస్తూ, ఆ అభివృద్ధికిఉన్న ఆటంకాలనుకూడా విద్యార్థిసంఘం తొలగిస్తూంది. డిటెన్షన్ విషయంలో జరిపిన కృషి ఇందుకు చక్కని నిదర్శనం. గుంటూరుజిల్లాలో డిటెయిన్ చేయడానికి నిశ్చయించిన విద్యార్థుల్లో 53 గురిని పరీక్షలకు పంపేలా చేసింది విద్యార్థి సంఘం. ఈసమస్యపై అనేకప్రాంతాల్లో ఉపాధ్యాయులు,తలిదండ్రులుకూడా కలిసివచ్చారు.

కాగితం, కిరసనాయిల్ సమస్యలపైఎంతో కృషి చేసింది. పామర్రు, గన్నవరంలో విద్యార్థిసంఘ నాయకత్వంకింద విద్యార్థులు స్వయంగా టిఫిన్ షెడ్డులు నిర్మించుకున్నారు.

ఈవిధంగా విద్యార్థి జీవిత సమస్యలపైని, జాతీయ సమస్యలపైని కృషిచేస్తూ ఆంధ్ర రాష్ట్ర విద్యార్థిసంఘం(అఖిలభారత సంఘశాఖ) 12000 సభ్యత్వానికి పెరిగింది. ఉరవకొండ, పామర్రు, పునాదిపాడు, కొల్లూరు, గన్నవరం మొదలైనచోట్ల సభ్యత్వ అర్హత (12 ఏళ్ళ పరిమితి)గలవారు నూటికి నూరు మంది సంఘంలో చేరారు.

ఈ విధంగా అభివృద్ధి పొందుతూన్న విద్యార్థి సంఘాన్ని విచ్ఛిన్నంచేయడానికి కొందరు 'ఆంధ్రరాష్ట్రవిద్యార్థిమండలి' పేరుతో బయలుదేరారు. నూటికి నూరుమంది విద్యార్థులు తమ సంఘాల్లోచేరి ఈ విచ్ఛిన్నకులకు తగిన జవాబు చెప్పాలి.

అనంతపురం జిల్లాలో

రాజకీయపంథాలో విద్యార్థులఐక్యత

అనంతపురంజిల్లా విద్యార్థిసంఘ ప్రతినిధుల సమావేశం ఫిబ్రవరి 13 వ తేదీన బి. వి. రావు (రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ సహాయకార్యదర్శి)గారిఅధ్యక్షతనుజరిగింది. వివిధప్రదేశాలనుండి 36 గురు ప్రతినిధులు హాజరయ్యారు.

అధ్యక్షులు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరించిన మీదట ఈ దిగువ రాజకీయతీర్మానం ప్రతిపాదించబడింది. కాంగ్రెసు ముస్లింలీగు, కమ్యూనిస్టు విద్యార్థులమధ్య దాదాపు 3 గంటలు చర్చలు జరిగినపిమ్మట యీ దిగువ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. "మనదేశాన్ని దురాక్రమణదారుల నుండి రక్షించడానికి, ఆహారసమస్యను పరిష్కరించడానికి, కాంగ్రెసునాయకులను విడిపించుకోడానికి, జాతీయప్రభుత్వాన్ని సాధించడానికి, కాంగ్రెసు-లీగు ఐక్యత అవసరమని, ముస్లింజాతుల, తదితరజాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరించడంద్వారానే జాతీయైక్యత సాధించగలము."

ఆహారసమస్యపై తీర్మానంలో, బెంగాలు, ఒరిస్సా, కేరళ, ఉత్తర విశాఖజిల్లా, రాయలసీమలలోని పరిస్థితులు తెల్పుచూ, అనంతపురంజిల్లాలో రెండుమూడు నెలలలో తప్పక బెంగాలు పరిస్థితులు రానున్నవని, కాబట్టి అన్ని రాజకీయపార్టీలు ముందుకువచ్చి ఆహారసమస్యాపరిష్కారంలో కృషిచేయవలయునని, వేసవి శెలవులలో విద్యార్థులు కాలం వృధాచేయక కరువు పరిష్కారానికి పూనుకోవాలని, ప్రాజెక్టుల నిర్మాణంలో పూనుకొని శాశ్వతంగా అనంతపురం జిల్లాలో కరువు రాకుండా చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయబడింది.

అనంతపురంజిల్లా విద్యార్థిఫెడరేషన్ ఆర్గనైజరైన వి. కె. ఆదినారాయణరెడ్డిగారిపై ప్రభుత్వం విధించిన డిటెన్షన్ ఆర్డరును రద్దు చేయాలని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని, అనంతపురం కాలేజీని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేర్చుకోవాలని, 1944 నుండి ఇంటర్మీడియట్లో భాషేతర విషయాలను తెలుగులో బోధించాలని, తీర్మానించారు.

అధ్యక్షులు విద్యార్థులలో ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి 'ఆంధ్ర విద్యార్థిమండలి' అనే పేరుతో కొందరు విచ్ఛిన్నకారులు పోటీ సంఘాన్ని పెట్టచూస్తున్నారని, అందులో ఎవ్వరు చేరగూడదని, అటువంటి విచ్ఛిన్నకారులను విద్యార్థులనుండి వేరుచేసి, ఐక్య విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలనీ, ప్రతినిధులను హెచ్చరిస్తూ సభను ముగించారు.

ఈ దిగువవారిని జిల్లా విద్యార్థిఫెడరేషన్ కార్య నిర్వాహకవర్గంగా యెన్నుకున్నారు: కె. తిరుమలరెడ్డి (ప్రధానకార్యదర్శి), యస్. సి. గంగిరెడ్డి (సహాయకార్యదర్శి), అశ్వత్థప్ప, రాఘవేంద్రరావు, గట్టప్ప, నరసింహులు, హనుమంతరెడ్డి, నల్లప్ప, జయలక్ష్మిరెడ్డి - సభ్యులు.

వక్తృత్వ పోటీలు, సంగీతపోటీలు, కళా ప్రదర్శనాల్లో విద్యార్థు లెంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏ మహనీయుడు ప్రింటింగు ప్రెస్‌ను కనిపెట్టాడోగాని, నేడు ప్రజాసామాన్యంలో విజ్ఞానాన్ని వెదజల్లడానికి ప్రింటింగు ప్రెస్ చాలా తోడ్పడుతూంది. పూర్వకాలం తాటాకు గ్రంథాలలో వ్రాయబడియున్న ప్రాచీన విజ్ఞానం నేడు అచ్చుపుస్తకాలద్వారా మనకు లభించుతోంది. కాళిదాసు, భవభూతి, షేక్స్పియర్, టాగూర్ వంటి ప్రపంచ విఖ్యాత కవుల రచనలు అన్ని భాషలలోను చదివి ఆనందించుతున్నాం. వృక్షశాస్త్రం, అర్థశాస్త్రం, తత్వశాస్త్రం, మొదలైన శాస్త్రాలన్నీ ప్రజలలో వ్యాప్తిజెందుతున్నాయి. ప్రపంచంలో యేమూల ఏ ఘటన జరిగినా, మరునాడు అది ప్రపంచం అంతటా వార్తాపత్రికల ద్వారా వ్యాపిస్తుంది.

ప్రింటింగ్ ప్రెస్ లేనిదే, ఆధునిక ప్రజాజీవితం అంధకార మయమవుతుంది.

ఇంత ప్రాధాన్యత వహించిన ప్రింటింగ్ ప్రెస్‌లలో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. యుద్ధకారణంగా ధరలు నాలుగైదు రెట్లు పెరిగినప్పటికీ, చాలా ప్రెస్‌లలో యుద్ధ అలవెన్సులే లేవు. కొన్నింట్లో ఉన్నా పేరుకు మాత్రమే. ప్రెస్‌లకు తగినంత కాగితం, సిరా, కిరసనాయిలు, దొరకడం లేదు. అందువల్ల చిన్న ప్రెస్‌లు నడవడమే కష్టమౌతూంది. పెద్దప్రెస్‌లలో కార్మికులు యజమానుల దాడికి గురి అవుతున్నారు.

ఈకష్టాలన్నింటికీ కారణమైన యుద్ధంపట్ల తమ వైఖరిని ప్రకటించడానికి, తమ యిబ్బందులు తొలగే మార్గం ఆలోచించుకోడానికి, మొన్న 13 వ తేదీన బెజవాడలో 7 వ ఆంధ్ర రాష్ట్ర ప్రెస్ కార్మికుల మహాసభ జరిగింది.

కరువురాక్షసిని నిర్మూలించుటకు కార్మికుల దీక్ష

ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు మహాసభ తీర్మానాలు

అధ్యక్షోపన్యాసం

మహాసభకు అధ్యక్షతవహించిన కామ్రేడ్ సి. వి. కె. రావు ఇలా ఉపన్యసించారు:

"కార్మికవర్గంలో ప్రెస్ కార్మికులు ఒకభాగం. కార్మిక శత్రువైన ఫాసిజాన్ని హతమార్చడంలో ప్రాణాల నర్పిస్తూన్న ప్రపంచ కార్మికయోధులకు మీరు అండగా నిలబడాలి. ప్రజలకు విజ్ఞానాన్ని వెదజల్లుతూ, దేశరక్షణకు తోడ్పడాలి. దేశంలో నేడు కరువురాక్షసి తాండవమాడుతోంది. దాన్ని నిర్మూలించుటకు మీరు మీ కర్తవ్యాల్ని నిర్వహించాలి. తిండిదొంగల ఆటలు సాగనీయకుండా రేషనింగు, ధరలకంట్రోలు, అవసరమని ఆందోళన చెయ్యాలి. ఆహారసమస్యను పరిష్కరించుటకు కాంగ్రెసు నాయకుల విడుదలను కోరాలి."

తీర్మానాలు

మహాసభకు రాజమండ్రి, ఏలూరు, బెజవాడ, తెనాలి, బందరునుంచి మొత్తం 40 మంది ప్రతినిధులు వచ్చారు. ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమైన 13 తీర్మానాలు, కొన్ని స్థానిక సమస్యలకు సంబంధించినవి, ఆమోదించబడ్డాయి. ప్రతి కార్మికునికి నెలకు రు. 8-8-0 చొప్పున యుద్ధఅలవెన్సు యివ్వాలనీ; సంవత్సరానికి 2 జతల దుస్తులు యివ్వాలనీ; సంవత్సరానికి 1 నెల సిక్ లీవు, 15 రోజుల క్యాజువల్‌లీవు యివ్వాలనీ; 6 మాసాలు పనిచేసిన తర్వాత ప్రతివానికి జీతం రు. 10 లకు తక్కువ ఉండకూడదనీ; బోనసు - ప్రావిడెంటుఫండు యేర్పాట్లు జరగాలనీ - తీర్మానించబడింది. కార్మికులు కాగితం, సిరా పొదుపుగా వాడి అధికోత్పత్తికి పాటుపడవలసిందని హెచ్చరించారు. అనవసరంగా ప్రెస్‌పని మానరాదని తీర్మానించబడింది. ప్రతిపట్టణంలోను వెంటనే రేషనింగు, ధరల కంట్రోలు ప్రవేశపెట్టవలసిందని ప్రభుత్వాన్నికోరుతూ మరొక తీర్మానం. బందరులో ఆంధ్రసైంటిఫిక్ కంపెనీ యజమానుల చర్యను నిరసిస్తూ ఒక తీర్మానం, బొగ్గుగనులలో స్త్రీలచే పనిచేయించుటకు అనుమతించిన ప్రభుత్వ చర్యను ఖండిస్తూ వేరొక తీర్మానం ఆమోదించబడ్డాయి. యజమానులు కార్మిక సంఘాలను గుర్తించాలని డాక్టర్ అంబేద్కరు ప్రవేశపెట్టనున్న బిల్లుకు యీ క్రింది సవరణలు సూచించబడ్డాయి.

(1) యజమానులు పెట్టే కార్మికసంఘాలను గుర్తించరాదు. (2) అక్రమంగా పనిలో నుండి తీసివేయరాదు. (3) ప్రభుత్వమిల్లులకు కూడా యీ బిల్లు వర్తించాలి.

తరువాత, రాజకీయ ప్రతిష్ఠంభనను పరిష్కరించుటకై జాతీయనాయకుల్ని విడుదలచేసి, జాతీయప్రభుత్వాన్ని స్థాపించవలసిందనీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ మరొక తీర్మానంచేయబడింది.

మహాసభ

సాయంకాలం ప్రెస్‌వర్కర్సు యూనియన్ ఆఫీసుపై కామ్రేడ్ బి. అప్పారావు ఎర్రజెండాను ఎగురవేశారు. తరువాత ఊరేగింపు. ఆతరువాత హనుమంతరాయ గ్రంథాలయంలో మహాసభ. మహాసభను ప్రారంభిస్తూ కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య ఆంధ్రరాష్ట్రంలో ప్రెస్‌వర్కర్సు ఉద్యమాన్ని నిర్మించి, కార్మికవర్గ పార్టీయైన కమ్యూనిస్టు పార్టీ సేవలో ప్రాణాలనర్పించిన కామ్రేడ్ చాపల వెంకటేశ్వర్రావుకు జోహారు లర్పించారు.

తరువాత, ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం, రాష్ట్ర విద్యార్థి సంఘం, రైల్వే కార్మికసంఘం, కృష్ణాజిల్లా మహిళాసంఘం మహాసభకు అందజేసిన సందేశాలు చదివి వినిపించబడ్డాయి.

కామ్రేడ్ సి. వి. కె. రావు అధ్యక్షోపన్యాసం యిస్తూ, రాష్ట్రంలో ఉన్న యూనియన్లు అన్నీ నిర్మాణయుక్తంగా పనిచేయాలని ఉద్బోధించారు.

వెంటనే వైజ్ఞానిక కార్యక్రమం ప్రారంభమైంది. గొల్లసుద్దులు,అన్నాచెల్లెలి సంవాదం, బుర్రకథ, మొదలైనవి ప్రదర్శించబడ్డాయి.

ఎన్నికలు

నూతనసంవత్సరానికి కామ్రేడ్ యిల్లూరు తాతయ్య అధ్యక్షులుగాను, కామ్రేడ్స్ అక్కల నరసింహారావు, ఆర్. సుబ్బారావు, ఉపాధ్యక్షులుగాను, ఎన్నుకోబడ్డారు. ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎల్. జోగారావు, సహాయ కార్యదర్శులు కామ్రేడ్స్ యస్. సోమేశ్వరరావు, బసిసెట్టి అప్పారావు. కోశాధికారి కామ్రేడ్ డి. కనకయ్య.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE